'స్వాతి' మాసపత్రిక -1981

# దుకాణం

స్కూటర్‌ని పోనిస్తున్నాడు రత్నాకర్.

సమయం సాయంత్రం.

రద్దీగా, బిజీగా రోడ్డు.

ఒకప్పుడు నిర్జనంగా, నిస్తేజంగా వుండే ఈ రోడ్డు ఇపుడు ఇరువైపుల దుకాణాలతో కలకలలాడిపోతోంది.

ఆ దుకాణాల్లో క్లినిక్‌లు, డిస్పెన్సిరీలు తగిలినపుడెల్లా రత్నాకర్ చూపులు చురుగ్గా అటు మళ్ళుతున్నాయి.

చురుకైన చూపులు.

చూసి చిన్నగా నవ్వుకుంటున్నాడు రత్నాకర్.

ఆ నవ్వులో గర్వముంది.

ఆ నవ్వులో తృప్తి వుంది.

స్కూటర్‌ని స్పీడుగా పోనిస్తున్నాడు రత్నాకర్.

అతనికి ప్రతి నిముషం చాలా విలువైనది. నిముష నిమిషానికి రిస్టువాచీ చూసుకుంటూ స్కూటర్‌ని స్పీడుగా పోనిస్తున్నాడు.

పట్నం నుంచి గోపాలపురం పోతోంది స్కూటర్.

పట్నంకి పది మైళ్ళ దూరంలోనున్న గోపాలపురం ఇపుడు టౌను పక్కన మినీటౌనులా వెలిగిపోతోంది.

పట్నంలో వుంటూ - పదేళ్ళుగా రోజూ గోపాలపురం వెళ్తున్న రత్నాకర్ ఆ వూరి మార్పులు గమనిస్తూనే వున్నాడు.

మొదట్లో ఎందుకూ పనికిరాని పల్లెటూరది. ఇపుడు నగరం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడం చేత చుట్టుపక్కల గ్రామాలన్ని పట్నాలుగా వేషం మార్చేసుకుంటున్నాయి. గోపాలపురం కూడా అలానే మారిపోయింది - తను చూస్తూండగానే.

స్పీడుగా పోతున్న స్కూటర్ గవర్నమెంటు సారాయి దుకాణం దాటింది. కోమటి కిరాణా దుకాణం దాటింది.

దాటి ఒక డాబా ముందు ఆగింది.

ఆ డాబా ముందొక బోర్డు

"లక్ష్మి క్లినిక్.

డా. రత్నాకర్, ఎం.డి.
రిజిష్టర్డు మెడికల్ ప్రాక్టీషనర్.
అసిస్టెంట్ సర్జన్ ఇన్ గవర్నమెంటు హాస్పిటల్
తెరుచు వేళలు : సాయంత్రం 5 గం నుంచి 9గం."

రత్నాకర్ టైము చూసుకున్నాడు.

పావు తక్కువ ఆరయింది.

స్కూటర్ హడావుడిగా పార్కు చేశాడు.

గబగబా మెట్లెక్కాడు.

వరండా తగిలింది.

వరండాలో నాలుగైదు బల్లలున్నాయి.

రోగులకు ఆ బల్లలు చాలక చాలామంది నించొనే వున్నారు.

డాక్టరు కోసం ఎదురు చూస్తున్న రోగులు డాక్టర్ని చూడగానే వాళ్ళ రోగాలు అపుడే సగం నయమైపోయినట్టు వారి ముఖాలు వికసించేయి.

ఈ రోజు తనకి అర్జంటు పని తగలడం చేత రావడం లేటయింది.

ఎంత లేటైనా రోగులు తన కోసం ఎదురు చూస్తారే గాని, మరో క్లినిక్కి పోరు. వాళ్ళ రోగాలు కుదరాలంటే రత్నాకరే మందు అని వాళ్ళ నమ్మకం.

అంచేత రోగుల సౌకర్యార్థం అదివారాలతో సహా తనెప్పుడూ క్లినిక్ తెరిచే వుంచుతాడు. పండగ, పబ్బాలకైనా క్లినిక్కెప్పుడూ మూయడు. తిరుపతి ఏడాదికి రెండుసార్లు తప్పక వెళ్తాడు. అప్పుడైనా క్లినిక్ మూయడు. ఒక నమ్మకమైన డాక్టరుని తన ప్లేస్‌లో పెట్టి వెళతాడు. వెళ్ళి వెంటనే గుండు కొట్టించేసుకుని వెన్వెంటనే వచ్చేయడానికి ప్రయత్నిస్తాడు.

ఆ గోపాలపుర జనాలకి దేవుని దయవల్ల రోగాలు రావాలే గాని – ఆ రోగ జనం తనని కాదని, మరెవరి దగ్గరకు పోలేరని ధైర్యం. అయితే రోజులెప్పుడూ ఒకేలా వుండవుగాబట్టి ఎందుకైనా మంచిదని భయపడతాడు. జాగర్త పడతాడు. దేవుణ్ణి ప్రార్థిస్తాడు.

స్ప్రింగ్ డోర్ తోసుకొని గదిలోకి వెళ్ళేడు రత్నాకర్.

లోన కంపోండరు రంగా.

వయసు నలభై. మనిషి పొట్టి. రంగు నలుపు. తెల్లచొక్కా కాకి ఫేంటు. హవాయి చెప్పులు.

రోజూ మనకిది తప్పదన్నట్టు కుడిచేయి పైకెత్తి దించేశాడు రంగా.

అది నమస్కార బాణంగా భావించి స్వీకరించేడు రత్నాకర్.

"అంతా దేనికది సిద్ధమేగదా" – అన్నాడు రత్నాకర్.

"అంతా సిద్ధమే సార్. తవర్దే ఆలెస్సెం" అన్నాడు రంగా.

మరో మూడు నిముషాలు అలస్యం చేశాడు రత్నాకర్.

అగరువత్తులు వెలిగించి గోడకి వేళాడుతున్న ఏడుకొండల వాణ్ణి, సత్యసాయిబాబాని, ఆ ఇద్దరి మధ్యనున్న లక్ష్మిదేవిని - ముగ్గుర్ని వేర్వేరుగాను, మొత్తంగాను దండం పెట్టి ప్రార్థించేడు.

ప్రార్థన ముగించి, అత్యంత ఉత్సాహంగా కూర్చున్నాడు కుర్చీలో.

ఇక తను యంత్రం.

రంగా సాయంతో రోగులను క్విక్ క్విక్‌గా చూడసాగేడు.

చూడ్డం అనేది ఎంత క్విక్ అయినప్పటికి రోగులకి ఏ మాత్రం అసంతృప్తి కలగనీయడు. రోగాన్ని కరెక్టుగా డయాగ్నైజ్ చేయడం సంగతేమోగానీ రోగుల సైకాలజీ మాత్రం చక్కగా స్టడీ చేస్తాడు. చేసి వాళ్ళను తృప్తిపరచేలా వైద్యం చేస్తాడు. పాపల్లో పసిపాప, కుర్రాళ్ళలో కుర్రాడు, పెద్దాళ్ళలో పెద్దాడు అయిపోతాడు.

డాక్టర్లా కాకుండా తనెంతో ఆత్మీయుడిలా ప్రవర్తిస్తాడు. రెండోసారి వచ్చిన రోగిని గుర్తుగా పేరెట్టి పిలుస్తాడు. కుటుంబ క్షేమ సమాచారాలు అడుగుతాడు. అడిగి 'అయ్యో' అంటాడు. నవ్వుతాడు. బాధ పడతాడు. సలహాలిస్తాడు. ధైర్యం చెబుతాడు. ఓదారుస్తాడు. 'శెబాష్' అంటాడు. అక్కర్లేకపోయినా ఇంజక్షన్లు చేస్తాడు. తనకి నమ్మకం లేకపోయినా, అవతల రోగిని బట్టి పథ్యం చెబుతాడు. ఫీజు విషయంలో వత్తిడి చేయడు. ఎంతిస్తే అంత పుచ్చుకుంటాడు. అరువులు కూడా నవ్వుతూ ఒప్పుకుంటాడు.

రోగుల్ని తనేం పీల్చేస్తున్నట్టుగాని, పీడిస్తున్నట్టుగాని అసలు ఎవర్కీ కనిపించనే కనిపించడు!

రోగులందర్నీ చూసి పంపిచేసేటప్పటికి సమయం తొమ్మిదిన్నర.

రత్నాకర్ వూపిరి పీల్చుకొని వెనక్కి వాలేడు.

సిగిరెట్ అంటించేడు.

రెండు దమ్ములు పీల్చాడు.

ముందుకు వంగి టేబుల్ సొరుగు తెరిచేడు.

లక్ష్మిదేవి గజ్జెల నృత్యం!

సొరుగు నిండా నోట్లు. నోట్లు.

ఆ నోట్లనలా చూస్తూ వుండిపోయేడు.

ఆ నోట్లలో తను టౌనులో కట్టించిన రెండంతస్తుల మేడ కన్పించింది.

ఆ నోట్లలో మొదట అద్దెకు తీసుకున్న ఈ డాబా తన సొంతం అయిపోవడం కనిపించింది.

ఆ నోట్లలో ఇక్కడ ఈ మధ్యనే కొనబోతున్న వెయ్యి గజాల ఖాళీస్థలం కన్పించింది. ఆ స్థలంలో తను త్వరలో కట్టాలనుకుంటున్న ఒక పెద్ద నర్సింగ్ హోమ్ మెరుస్తూ కనిపించింది.

ఆ నోట్లలో ఇంకా మూడు బ్యాంకుల్లో అకౌంట్లు, పెళ్ళాం పట్టుచీరలూ, నగలూ, పిల్లల కాన్వెంటు చదువులూ, మెత్తని పరుపులూ, సోఫాలూ, ఫ్రిజ్‌లూ, విస్కీ సీసాలూ, పేకాట క్లబ్బులూ...ఎన్నెన్నో కన్పించి వుండేవి - రత్నాకర్‌ని అప్పారావు డిస్టర్బ్ చేసి వుండకపోతే.

**- 2 -**

గదిలోకి అడుగెడుతూ "నమస్తే" అన్నాడు అప్పారావు.

"నమస్తే, నమస్తే" అన్నాడు - రత్నాకర్- సొరుగు మూసేస్తూ.

రెండు నమస్తేలెందుకంటే అప్పారావుతోబాటు మరొకరున్నారు.

ఆ మరొకరు మగ కాదు, ఆడ అని గమనించేడు.

అందగత్తని గుర్తించేడు.

అప్సరసకి యీక్విలెంట్ అని మెచ్చుకున్నాడు.

చెవికి జుంకాలు, మెళ్ళో నక్లీసు, గొలుసు, నల్లపూసల దండ, ఇంత బొట్టు, కుడిచేతికి డజను గాజులు, ఎడమ చేతికి వాచీ. పట్టుచీర... అప్సరస కొంత నాటుగా కన్పించింది. కాని మోటుగా తోచలేదు రత్నాకర్‌కి.

ఆ నాటు అప్సరస అందాన్ని మోటుగా మెచ్చుకోడం వరకే గాని మరొక అడుగు పదండి ముందుకంటూ చొరబడే అధికారం, హక్కు ఎవర్కీ లేవు. అవన్నీ అప్పారావువి. జస్ట్ మూడు ముళ్ళు మాత్రమే వేసిన పాపానికి లేక పుణ్యానికి ఒక అపురూపమైన అప్సరస అతని సొంతమైపోవడం, సొత్తయిపోవడం, ఆస్థిగా మారడం చాలా దారుణం, అక్రమం, అన్యాయం అనుకున్నాడు రత్నాకర్.

ఆస్తి హక్కు వ్యక్తిపరంగాక సమాజపరం అవడమే సమసమాజం, నిజమైన సోషలిజం అని ఏవేవో అంటారు కదా మన కమ్యూనిస్టు మిత్రులు. మరి కామ్రేడ్స్! ఈ దేశంలో అందాల అప్సరసలు అప్పారావుల వ్యక్తిగత ఆస్తులుగా వుండిపోకుండా సమాజపరం చేసి తీరాలనీ, అప్సరసల అందాలు అందరూ అనుభవించక తప్పదనీ అనరేలా? నవ్వుకున్నాడు రత్నాకర్. తనకింత చక్కటి సోషలిస్టు వూహ వచ్చినందుకు తనని తాను అభినందించుకోకుండా వుండలేకపోయాడు.

టేబుల్ పక్కనున్న కుర్చీలో అప్పారావు.

పక్కన నాటు అప్సరస.

కూర్చోలేదు - నించుంది.

వాళ్ళిద్దరూ రత్నాకర్‌కి అభిముఖంగా వున్నారు.

తన సొరుగు నిండా నోట్లులా ఆమె ఒళ్ళంతా అందం.. ఈ గది పావనమైపోయింది. ఆమె ఒక్కత్తే వస్తే బాగుణ్ణు అనుకున్నాడు.

"బాగున్నారా?" అనడిగేడు రత్నాకర్.

బాగున్నవాళ్ళెవరూ (సాధారణంగా) ఇలాంటప్పుడు ఈ చోటికి రావాల్సిన పని లేదు. కాబట్టి ఆ ప్రశ్నకి అర్థం లేదు కాబట్టి అది కుశల ప్రశ్నగా అర్థం చేసుకున్నాడు అప్పారావు.

కుశల ప్రశ్నలయ్యేయి.

అప్పారావు అసలు విషయానికొచ్చేడు.

కాలి బొటన వేలుకి దెబ్బతగిలిందన్నాడు.

"ఎప్పుడు?"

"పది రోజులవుతుంది"

"బాగుందండి. అప్పుడు దెబ్బ తగిల్తే ఇప్పుడు ట్రీట్‌మెంటుకొచ్చేరా... ఏవిఁటి సార్. చదువుకున్నవాళ్ళు మీరు కూడా..."

"ఏదో చిన్న దెబ్బే. అదే మానిపోతుందనుకుంటే..."

"ఇపుడది బాగా మోపు చేసింది. అంతేనా? ఏదైనా మరిక లాభం లేదనుకున్నాకేలెండి మేం గుర్తుకొస్తాం."

"అపదల్లోనే కదండీ దేవుడు నిజంగా గుర్తుకొచ్చేది".

"పొరపాటు. దేవుడు నాకు రోజూ గుర్తుంటాడు."

"అంటే మీకు దేవునితో రోజూ పనిపడుతోందన్నమాట. అతని దయ డైలీ మీకు తప్పనిసరన్నమాట... అయినా డాక్టరుగారూ మీరేమీ అనుకోనంటే ఒక మాట."

"చెప్పండి"

"సమాజానికి శాస్త్రీయ దృష్టి ఎంత అవసరమో సైన్సు నొక్కి చెబుతోంది... కాని డాక్టరు గదిలో దేవుళ్ళనీ, బాబాలనీ చూస్తుంటే... సైన్సు కూడా దేవుణ్ణి నమ్మక తప్పడం లేదన్నమాటని అనిపిస్తోంది నాకు."

"చూడండి ఇందులో నేను అనుకోడానికి ఏమీ లేదు.మీరు అడిగింది అమాయక ప్రశ్న. అంతే. సైన్సు ప్రయోగానికి, పరీక్షకి నిలబడి రుజువైన సత్యాన్ని మాత్రమే గుర్తిస్తుంది. దేవుడు వాటికేమీ లొంగేవాడు, దొరికేవాడు కాదు' గనక సైన్సు నమ్మదు. ఆ మేరకు అది యదార్థమైనప్పటికీ, సైన్సు నమ్మలేదని దేవుణ్ణి మనం నమ్మడం మానేస్తామా? దేవుడు లేనే లేడనేస్తామా? సైన్సుకి కూడా లొంగని అతీత శక్తులున్నాయనేది మనం గ్రహించాలి. ఆ శక్తుల ముందు మానవుడెంత? బాబాల శక్తులు, మహిమలు అతీత శక్తులనే నా భావన. ప్రతీది హేతుమార్గంలో, శాస్త్రీయ దృష్టితో చూడాలనుకోడం మూర్ఖత్వం. సైన్సు మానవ మేధస్సు యొక్క అపూర్వ అఖండ విజయమని నేను ఒప్పుకుంటాను. ఆ విధంగా తన మేధస్సుతో నూతన సృష్టి చేస్తున్న మానవుణ్ణి సృష్టించేది మాత్రం ఆ భగవంతుడేనని నేను ఖచ్చితంగా నమ్ముతాను. నా మటుకు నేను దేవుణ్ణి నమ్మి బాగుపడ్డానేగాని చెడిపోలేదు. నా కదే దృష్టాంతం. నా కదే రుజువు. అయితే దేవుణ్ణి నేను నమ్మితే, సైన్సు కూడా నమ్మేసినట్టు కాదు; సైన్సు నమ్మకపోతే నేను నమ్మగూడదని ఎక్కడా రూలు లేదు. అలాంటి రూలు చేసే అధికారం ఏ మానవమాత్రుడికి లేదు."

డాక్టరు ఉద్రేకం, ఉద్వేగంతో కాకుండా నెమ్మదిగానే అన్నప్పటికీ అతని ముఖంలో సీరియస్‌నెస్ గమనించి వెనక్కి తగ్గేడు అప్పారావు.

తనకి డాక్టరుతో పరిచయమైతే వుంది గాని అతనితో సమానంగా వాదించగలిగే స్నేహం,

చనువు లేవు.

అప్పారావు దృష్టిలో సైన్సుని నమ్మడం పురోగమనం, దేవుణ్ణి నమ్మడం తిరోగమనం. నీవు దేవుణ్ణి నమ్ముతూ కూర్చుంటే, హేతువాదంతో శాస్త్రీయ దృష్టితో ఏ విషయాన్నీ ఆలోచించలేవు. ముందుకి పోలేవు. ఈ రోజుకి సైన్సు కందని అతీతశక్తులు కొన్ని ఉన్నాయనేది యదార్థమే. అయితే సైన్సు నిరంతర అధ్యయనంతో అపూర్వ పరిశోధనతో ముందుకి పోతోంది గాబట్టి రేపు ఆ శక్తుల పిలక పట్టుకునే శక్తి సైన్సుకి వుందని, ఈ రోజుకి కాకపోతే ఏ రోజుకైనా సైన్సుకి అందనిదంటూ ఏదీ వుండదని గట్టిగా నమ్ముతాడు.

అంతలో – సీరియస్ కేసొకటి వచ్చింది.

ఆ కేస్ ఎటెండ్ కాడానికి గభాల్న కుర్చీలోంచి లేచాడు డాక్టర్.

ఆ రోగిని బల్లపై పడుకోబెట్టి స్టెత్‌తో పరీక్షిస్తున్నాడు.

అప్పారావు అదంతా చూసి నిట్టూర్చేడు.

'ఆ ఆడమనిషి చావుబతుకుల మధ్య వచ్చింది. మొదట్లో తన రోగం నయం చేయమని దేవుణ్ణి మొక్కే వుంటుంది. కాని బతుకు మీద ఆశతో డాక్టర్ దగ్గరికి పరుగున వచ్చింది. అంటే ఏవిటి?'

దేవుడు ఒక నమ్మకం.

డాక్టర్ యదార్థం.

ప్రాణాన్ని నమ్మకానికి బలిపెట్టలేక యదార్థాన్ని ఆశ్రయించింది.

గమ్మత్తు ఏమిటంటే ఆ మనిషి ఆ విషయం గుర్తించదు.

ఆ మనిషి డాక్టరుకి, దేవుడికి – ఇద్దరికీ దండం పెడుతుంది.

అయితే వాళ్ళిద్దరూ దండాలకి తృప్తి చెందరు.

డాక్టరు ఫీజు నొల్లుకుంటాడు.

దేవుడు మొక్కు తీసుకుంటాడు.

– నవ్వుకున్నాడు అప్పారావు.

అప్పారావు భార్యకి కాళ్ళు పీకినట్టున్నాయి. అక్కడే గోడ పక్కన కుర్చీ వుంటే తన భర్త పక్కకి లాక్కుని కూర్చుంది.

ఆమె క్లినిక్కి రావడం ఇదే ప్రథమం. కొత్తగా, భయంగా వుంది.

అదే చెబుతూ "వెళ్ళిపోదాం బాబూ" అంది నెమ్మదిగా.

"వుండూ, భయమెందుకు" అన్నాడు అప్పారావు.

ఆమెను బోరు నుండి, భయం నుండి విముక్తురాల్ని చేసే ఉద్దేశంతో గోడలకున్న వివిధ కాలెండర్లను చూపించేడు.

చూసింది.

"ఆ టేబుల్‌పైనున్న టార్చిలైటు, పెన్నుల స్టాండు, బాల్‌పెన్నులు, డైరీ, యాష్ట్రే, ఈ

పేపరు వెయిట్లూ... చూశావు కదా" అన్నాడు.

"చూశాను, ఏం?" అంది.

"మరేం లేదు ఇవేం డాక్టరు సొంతం కావు. మందుల అడ్వర్టయిజు నిమిత్తం మందుల కంపెనీలు ఇచ్చినవే" అని నవ్వుతూ అన్నాడు. "ఆ ప్రిస్కిప్షన్ పాడ్ వుందా? అది మన వెంకటరమణ మెడికల్ షాపు ఇచ్చింది. అందులో ప్రతి కాగితంపై వాళ్ళ దుకాణం పేరుంటుంది. ఆయా మందుల కంపెనీలు, ఈ మందుల దుకాణం డాక్టరుకి పైసా ఖర్చు లేకుండా అవన్నీ ఎందుకు సమకూరుస్తారో తెల్సా? ఆ బీరువాలో మందులూ, మాత్రలూ చూశావా. అవి కొన్ని మెడికల్ రిప్రజెంటెటివ్స్ ఇచ్చిన శాంపిల్సు. మరికొన్ని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నడిచొచ్చేసినివి - అర్థమయిందా?"

తను చెప్పినవి ఆమెకి అర్థమయ్యాయో లేదో గాని, అవి డాక్టరు మాత్రం వినగూడని విషయాలని అర్థమయింది.

భర్త అతి నెమ్మదిగానే చెవిలోనే వూదినప్పటికి అవి డాక్టరు వినేశాడేమోనని భయపడింది.

"చాల్లెండి. వూర్కోండి" అని సైగలతో మందలించింది.

భార్యను భయం నుంచి తొలగిద్దామనే తన ప్రయత్నం మరికొన్ని కొత్త భయాలకి దారి తీయడంతో అప్పారావు నోరు మూసుకున్నాడు.

డాక్టరు, కాంపౌండరు, రోగి... పరీక్ష గదిలో.. నాలుగు నిముషాలు...

తర్వాత -

డాక్టరు వాష్‌బేషిన్‌లో చేతులు కడుక్కుని వచ్చి కూర్చున్నాడు.

సిగరెట్ పెట్టె తీశాడు.

నాటు అప్సరసని చూసేడు.

సిగరెట్ తాగకుండా తనెలా వుండలేడో, అలాగే అప్సరస అందాన్ని తాగకుండా వుండలేకపోతున్నాడు.

సిగరెట్ పెదాల మధ్య వుంది.

అప్సరస కళ్ళ ముందు వుంది.

కాని సిగరెట్ స్థానంలో అప్సరస వుంటే....

గట్టిగా వదలకుండా ఏకబిగిన ఒకే దమ్ముకి...

క్రషర్ మధ్య చెరుకు గడలా..

తను రసమంతా తాగేసి...

అప్పారావుకి పాపం పిప్పు మాత్రం వదిలేసి....

నోట్ల చప్పుడు అతని తీయని వూహని దెబ్బ తీసింది. డిస్టర్బు చేసింది.

డిస్టర్బు చేసింది నోట్లే కాబట్టి రత్నాకర్‌కి చిరాకు రాలేదు. కోపం కల్గలేదు.

డబ్బు తర్వాతే అప్సరసలూ, అన్నీనూ.

డాక్టరు అడిగినంత ఫీజు ఆ రోగి చెల్లించింది.

దండం పెట్టింది. వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతుంటే మళ్ళీ రేపు రావాలనే సంగతి గుర్తుచేశాడు డాక్టరు – చిన్నగా నవ్వుతూ.

'డాక్టర్‌జీ! ఆ రోగి దగ్గిర డబ్బుంటే జబ్బు తగ్గినా, తగ్గకపోయినా – మీరెన్ని రోజులు రమ్మంటే అన్ని రోజులు వస్తుంది. తప్పక మీకు ఫీజులు చెల్లిస్తుంది. ఆ రోగి డబ్బు ఇబ్బంది గల రోగి అయితే జబ్బు ఏ మాత్రం తగ్గినట్టనిపించినా రేపు రావడం అనుమానమే. ఏమైనా డాక్టర్లూ! మీకు జోహార్లు! మీ ఉచ్చు నుంచి రోగి తప్పుకో సాధ్యం కాదు. రోగికి రోగం తగ్గినట్టూ ఉండాలి. తగ్గకుండా వుండాలి. ఈ డాక్టరు దగ్గరకొస్తే నయమవుతుందన్న నమ్మకం రోగికి కలిగించాలి. అదే సమయంలో పిండుకోగలిగినంత ఫీజు పిండుకోవాలి.'

అలా అనుకున్న అప్పారావుకెందుకో మంగలి షాపు గుర్తుకొచ్చింది.

తనకి ఒక మంగలి బాగా, అందంగా క్షవరం చేస్తాడు. నాలుగైదేళ్ళుగా వాడి దగ్గరికే వెళ్తున్నాడు. ఆ మంగలి, షాపులో లేకపోతే క్షవరమైనా చేసుకోవడం మానేస్తాడు గాని మరో మంగలి షాపు కెళ్ళడు. ఒకసారి కటింగ్ చేసుకుంటే మరో రెణ్ణెల్లపాటు మళ్ళీ కటింగు ప్రశ్న ఉదయించగూడదని తనకి వుంటుంది. కాని మంగలి కటింగ్ ఎంత గమ్మత్తుగా చేస్తాడంటే మళ్ళీ 20 రోజులకే వాడి ముఖం చూడక తప్పదు.

అంటే మంగలి క్షవరం ఎంచక్కా అందంగా చేస్తున్నాడు; 'మళ్లా నెల తిరగకముందే నీవు రాక తప్పదురా నాన్నా' అంటున్నాడు. తను తప్పించుకోలేక తప్పక వెళుతున్నాడు.

ఆ విధంగా క్లినిక్కి, మంగలి షాపుకి సామ్యం కనిపించింది.

రోగికి రోగం కుదిరినా, కుదరకపోయినా క్షవరం మటుకు ఖాయం!

దువ్వెన, కత్తెరతో క్షవరం చేస్తున్న మంగలిగా రత్నాకర్‌ని ఒకసారి వూహించుకున్నాడు అప్పారావు.

పక్కుమని నవ్వు వచ్చేసింది. బలవంతం మీద ఆపుకున్నాడు.

నవ్వు ఆపుకునే ప్రయత్నంగా, "డాక్టరుగారూ మీరు మాత్రం ఈ గోపాలపురంకి అతి ప్రియమైన డాక్టరైపోయేరు" అన్నాడు అప్పారావు, తమరొక బహుమంచి మంగలిగారు' అని అనకుండా.

రత్నాకర్ కుర్చీలోంచి కొద్దిగా కదిలేడు.

"థాంక్స్. అంతా మీ అభిమానం. ఆ భగవంతుని దయ"

"మానవసేవ మాధవసేవతో ఎంతగా సమానం అయినప్పటికీ మీ విసుగులేని సేవకి, ఓపిక్కి జోహార్లు సార్. పగలంతా పెద్దాసుపత్రిలో సేవ. సాయంత్రం నుంచి రాత్రి తొమ్మిది, పది దాక ఇక్కడ సేవ. లైఫ్‌ని ఇంకేం ఎంజాయ్ చేస్తారండి మీరు? చివరికి ఆదివారాలు కూడా ఏ సినిమాకో, షికారుకో పోకుండా క్లినిక్‌లో కూర్చుంటారు."

"ఏం చేయమంటారు చెప్పండి? నే చేపట్టిన వృత్తి అలాంటిది. తప్పదు మరి. కాని

అప్పారావుగారూ! ఒక్కోసారి నాకీ ప్రాక్టీసుపై విరక్తి కలుగుతుంది. మీలాగే మేమూ డ్యూటీల నుంచి ఇంటికి వచ్చి పెళ్ళాం పిల్లలతో సరదాగా గడపాలని వుంటుంది. సినిమాలకీ, షికార్లకీ వెళ్ళాలని వుంటుంది. కాని మాకా అదృష్టం ఏది చెప్పండి? మీరనుకుంటున్నట్టు రోగులు రాత్రి తొమ్మిది, పదింటికి నన్ను వదిలేస్తే చాలా సంతోషం. కాని వదలరు. జలగల్లా అర్థరాత్రులు కూడా ఇంటికొచ్చి లేపేస్తుంటారు. ఆఖరికి పెళ్ళాం పక్కలోంచి, కంచం ముందు నుంచి అర్థాకలితో మధ్యలో లేచిపోయిన సందర్భాలు కూడా వున్నాయి. ఏం చెప్పమంటారు మా బాధలు చెప్పండి" అన్నాడు రత్నాకర్.

'అయ్యయ్యో డాక్టరుగారూ. ఎందుకంత బాధపడిపోతారూ? అన్నేసి బాధలు పడిపోతూ మిమ్మల్నెవరు సార్ ఈ ప్రాక్టీసు పెట్టమన్నారు.

గవర్నమెంటా? లేక గోపాలపురం గోవులా?

మీరు ప్రాక్టీసు చేయకుంటే మీకొచ్చిన నష్టమేంవిటి?

మీకు జరగదా?

ఎందుకు జరగదు?

మంచి గవర్నమెంటు ఉద్యోగముంది. వెనుక ఆస్తిపాస్తులేవో వున్నట్టు వున్నాయి. కట్నం పేరుమీద కొంత లాగకుండా వుండి వుండదు. మరిక మీకేమి లోటు?

ఇక్కడ పదేళ్ళ ప్రాక్టీసులో మీరెంతంత గడించారో అందరికి తెలుసు.

మీకు నిజంగా పెళ్ళాం, పిల్లలతో సరదాగా గడపాలనుందా?

సింపుల్! ప్రాక్టీసు మానేయండి. ఎవరొద్దన్నారు?

కొన్ని వేల మంది నిరుద్యోగ డాక్టర్లున్నారు. ప్రయివేటు ప్రాక్టీసు వాళ్ళకి పూర్తిగా వదిలేయండి. వాళ్ళని ప్రాక్టీసు చేసుకోనివ్వండి?

అసలు గవర్నమెంటు ఉద్యోగికి జీతం కాక ఎటువంటి అదనపు ఆదాయం వున్నా, రాబడి వున్నా ఆఫెన్సు కదా.

మరి మీరు కూడా గవర్నమెంటు ఉద్యోగస్తులే అయినపుడు ప్రత్యేకంగా మీకేల మినహాయింపు? ప్రాక్టీసుకి మిమ్మల్ని గవర్నమెంట్ ఎలా అనుమతిస్తోంది?

గవర్నమెంటు ఆ మధ్య ఒకసారెపుడో ప్రయివేటు ప్రాక్టీసు నిషేధించి, అందుగ్గాను కాంపెన్సేటరీగా అంతో, ఇంతో అలవెన్సు ఇచ్చింది. ఇచ్చినప్పటికీ మీరెంత మూలిగారు? ఎంత అలిగారు? గిజగిజలాడి ఎంతెంత గొడవచేశారు?

గవర్నమెంటు నిషేధించిందని ప్రయివేటు ప్రాక్టీసు మానేశారా?

లేదు.

బోర్డు తీసేశారు అంతే. ప్రాక్టీసు మాత్రం కొనసాగించేరు - దొంగచాటుగా.

సో, డాక్టరుగారూ హరికథలు చెప్పకండి.

ఇది సేవ సేవంటూ రోగుల్ని పీడించుకు తినే వ్యాపారం. బిజినెస్.

యస్. బిజినెస్. బిజినెస్. బిజినెస్!

నిజంగా ఏ అద్భుతం వల్లో ప్రజలంతా రోగాలు లేకుండా ఆరోగ్యంగా వుండిపోతే - పై రాబడి లేక దిగులుతో ఆ రోగాలు మీకు వచ్చేయడం మాత్రం గ్యారంటీ' - అనుకున్నాడు అప్పారావు.

"సరేగాని అప్పారావుగారూ! ఇలా రండి. దెబ్బేదో అన్నారు చూపించండి" అన్నారు రత్నాకర్.

"దెబ్బ తగిలింది నాక్కాదండి. మా మిసెస్‌కి".

"మీ మిసెస్‌కా? భలేవారే. మీ మాటలు బట్టి మీకే అనుకున్నా... ఇలా రామ్మా" ట్రీట్ చేయడం హుస్కు అప్పారావుకి కాదు, నాటు అప్సరస కనగానే ఒక రకమైన ఉత్సాహం రత్నాకర్‌కి - వెయిన్‌లోకి సిరంజీ గుచ్చినట్టు ఆమె కళ్లలోకి గుచ్చి గుచ్చి చూస్తూ -

"మీ పేరేమిటమ్మా" అని అడిగేడు.

"వరలక్ష్మి"

ఆమె చెప్పలేదు. అప్పారావు చెప్పేడు.

"ఏదమ్మా... ఈ స్టూలుపై కాలు పెట్టి చూపించు"

కాలు మాత్రం అప్పారావు చూపించలేదు. ఆమె చూపించింది. దెబ్బెలా తగిలిందని ఆమె నడిగేడు.

ఎలా తగిలిందో అప్పారావు చెప్పేడు.

ఎప్పుడు తగిలిందని అప్పారావుని అడగలేదు. ఆమెనే అడిగేడు.

జవాబు అప్పారావు చెప్పేడు.

"నొప్పిగా వుంటుందామ్మా" అంటే అవునన్నాడు అప్పారావు.

రత్నాకర్‌కి ఒళ్లు మండిపోయింది.

'నీవు ఈ నాటు అప్సరసకి మొగుడు గారివి కావొచ్చు.కాని వురే అప్పిగా... ఇపుడామె నా రోగి... నేను డాక్టర్ని... మద్దెన నీ వెవడివిరా ఎవడివి? ముందు గదిలోంచి బయటకెళ్ళు. గెటవుట్ ఐసే' అనేయగలడు అదే గవర్నమెంటు ఆసుపత్రి అయితే.

"లక్ష్మిగారు మూగవారు కాదు గదా"

"అబ్బే కానండి" అంది వరలక్ష్మి గాభరాగా.

"మీరేం మాట్లాడరేం. మీ ఒంట్లో బాధ మీరే చెప్పుకోవాలి. అప్పుడే ఏ డాక్టరైనా డిసీజుని కరెక్టుగా డయాగ్నైజు చేయవీలవుతుంది. అర్థమయిందామ్మా... ఇపుడు చూసేరా. ఎప్పుడో తగిలిన దెబ్బ బాగా కుళ్లిపోయేక వచ్చేరు. మరో మూడు రోజులు ఇలాగే నిర్లక్ష్యం చేసి వుంటే ఎంత ప్రమాదమో తెల్సమ్మా. సెప్టిక్ అయిపోయి వేలో, కాలో తీసేయాల్సి వచ్చేది."

వరలక్ష్మి గతుక్కుమంది.

అప్పారావు గుండెలు గుభేల్మన్నాయి.

"మరేం ప్రమాదం లేదు కదా డాక్టర్" భయంగా అడిగేడు అప్పారావు.

"మరేం భయం లేదు. డోంట్ వర్రీ."

అప్పారావు వర్రీ తగ్గింది.

"ఇలా కూర్చోమ్మా"

కూర్చుంది వరలక్ష్మి.

"ఈ మధ్య మీకు జ్వరం రావడం... అలాంటిదేమైనా వుందా"

"లేదండి." అప్పారావు కాకుండా వరలక్ష్మే జవాబు చెప్పింది.

రత్నాకర్ సీరియస్‌గా ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

పల్స్ చూసేడు.

ఆమె విశాలమైన కళ్ళను ఒక చేత్తో ఇంకా విశాలం చేసి, మరో చేత్తో టార్చి వేసి చూసేడు.

నాలిక చూపమన్నాడు.

ఆమెకి చూపడం చేతకాలేదు.

నాలిక ఎలా చూపాలో తన నాలికతో చేసి చూపించేడు.

అయినా ఫాలో అవలేకపోయింది. మళ్ళీ, మళ్ళీ ఫెయిలయ్యింది. సిగ్గుపడి పోయింది. ముసిముసిగా నవ్వేసింది.

రత్నాకర్ కూడా నవ్వేడు - చాలా హాయిగా.

ఆమె ఫెయిల్ అవ్వడమే రత్నాకర్‌కి హాయిగా వున్నట్టుంది.

చివరికి సెవన్తు టేక్ ఓకే అయింది. తర్వాత -

స్టెత్ మెళ్ళో తగిలించుకుని దయాభ్రం ఆమె గుండెలపై పెట్టాడు.

నొక్కేడు.

అక్కడ నొక్కేడు.

ఇక్కడ నొక్కేడు.

చాలా చోట్ల చాలాసార్లు

నొక్కేడు. నొక్కేడు.

అప్పారావు గుండె నెవరో నొక్కేసినట్టు ఏదో బాధ.

మొగుడు ఎదుట పెళ్ళాం వక్షాన్నీ, వీపునీ అలా పరాయి మగాడు... ఆఫ్‌కోర్స్ డాక్టరే కావొచ్చు.... చూడలేకపోయేడు తను.

తల గోడ వైపు తిప్పేసుకున్నాడు.

గోడపై కాలెండర్లో మూడేళ్ళ బాబు స్టెత్ మెళ్ళో వేసుకొని అప్పారావుని చూసి పకపకా నవ్వుతున్నాడు.

స్టెత్ తీసి టేబుల్ మీద పెట్టి వూపిరి పీల్చుకున్నాడు రత్నాకర్.

రత్నాకర్ గుండె తీవ్రంగా కొట్టుకుంటోంది.

"అప్పారావుగారూ. షీ యీజ్ ఆల్‌రైట్. నథింగ్ టు వర్రీ. ఓ వారం పాటు ఇంజెక్షన్లు తీసుకొని, డైలీ డ్రెస్సింగ్ చేస్తే సరిపోతుంది" అన్నాడు రత్నాకర్ చిరు చెమట తుడుచుకుంటూ.

పెళ్ళాంకి ప్రమాదం లేదన్నందుకో, లేక పెళ్ళాం గుండెలపై నుంచి స్టెత్ తీసేసినందుకో మరి "థాంక్యు డాక్టర్" అన్నాడు తేలికైన గుండెతో అప్పారావు.

అంతలో –

క్లినిక్‌లో ఇరవై రెండేళ్ళ కుర్రాణ్ణి ఎవరో ముగ్గురు మోసుకొని వచ్చేరు.

ఆ కుర్రాడికి మిగతా చోట్ల చిన్న దెబ్బలే తగిలాయిగాని తొడ దగ్గిర మాత్రం చాలా పెద్ద గాయం.

తొడ బాగా చీరుకుపోయింది.

బోల్డు రక్తం పోతోంది.

డాక్టరు సీట్లోంచి గబాల్న లేచేడు.

ఏమయ్యిందేమయ్యిందని అడిగేడు.

స్కూటర్ ఆక్సిడెంట్.

ఆక్సిడెంటు ఎలా అయింది తెల్సుకున్నాడు.

"లాభం లేదు. వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళిపోండి" అన్నాడు రత్నాకర్.

"అది కాదండి...."

"మరేం మాటాడకండి. కుర్రాడి కండిషన్ ఏమీ బాలేదు. వెంటనే పెద్దాసుపత్రికి తీసుకెళిపోండి."

"అలాగే తీసుకెళ్తాం సార్.. కాని ఈలోగా... బ్లడ్ కట్టడానికి ఫస్ట్ ఎయిడ్ లాంటిది.."

డాక్టరు చిరాగ్గా – "ప్లీజ్, నా మాట వినండి. నేనేం చేయలేను. అతన్ని ట్రీట్ చేయడానికి నథింగ్... నథింగ్ ఇన్ మై హేండ్. నేను అశక్తుణ్ణి. ప్లీజ్. అతన్ని వెంటనే ఆసుపత్రికి తీసుకుపోండి. ఇమిడియట్‌గా తీసుకుపోండి. ప్లీజ్. ప్లీజ్" అన్నాడు.

క్లినిక్ నుంచి ఆ కుర్రాణ్ణి తీసుకుపోయేకగాని డాక్టరు ప్రాణం కుదుటబడలేదు.

పెద్ద నిట్టూర్పు విడుస్తూ కుర్చీలో కూర్చున్నాడు. సిగరెట్ వెలిగించి ఒక దమ్ము లాగేడు.

అప్పారావుకి డాక్టరు ప్రవర్తన అర్థం కాలేదు.

ఆ ఏక్సిడెంటు కుర్రాణ్ణి ట్రీట్ చేయకుండా ఎందుకు పంపించేసినట్టు?

రత్నాకర్ అప్పారావు ఫీలింగ్స్ గమనించేడు.

"అప్పారావుగారూ నేనేదో నిర్దయగా, అమానుషంగా బిహేవ్ చేశాననుకుంటున్నారు కదూ. అనుకోండి. అనుకోండి. నేనేం బాధపణ్ను" – డాక్టరు కంఠంలో టెన్షను, కందగడ్డలా ముఖం.

"అది కాదండి. అతన్ని ఏ మాత్రం చూడకుండా ఆసుపత్రికి పొమ్మన్నారు కదా. అతను అసుపత్రికి వెళ్ళక మునుపే చచ్చిపోతే, మీకు బాధగా ఉండదా. అయ్యో అతన్ని ఆసుపత్రికి చేరేవరకైనా నాకు అందుబాటులోనున్న వైద్యం చేసుంటే బతికేవాడేమో అని మీకు అనిపించదా. క్షమించండి. నాకు తెలీక అడుగుతున్నా."

"యస్. యస్. ఐ ఎగ్రీ విత్ యూ. కాని మీరన్నట్టు అతన్ని ట్రీట్ చేస్తే అతను బతికితే బతకొచ్చు. నాకు మాత్రం చావే"

అతన్ని బతికించడం డాక్టరుకి చావెలా అవుతుంది?

అప్పారావుకి అర్థం కాలేదు.

"ఏక్సిడెంట్సులో, కొట్లాటల్లో దెబ్బలు తగిలించుకొనివస్తే గొప్ప హడల్ నాకు. ఏమంటే రెండు మూడుసార్లు నాకు అనుభవమయ్యింది. అలాంటి అనుభవాలు నా శత్రువుకైనా వద్దు. వద్దు. ఆ కుర్రాడికేదో మనం వైద్యం చేసి పంపించేయడంతో నా బాధ్యత అయిపోతే నేను ఖచ్చితంగా నాకు చేతనైన చికిత్స చేయగల్ను. కాని ఈ కేసుల్లో వాసన తగలాలేగాని పోలీసులు చొరబడకుండా వుండరు. చొరబడ్డారో కోర్టులకి లాగకుండా వదల్రు. కాకీ బట్టలు, నల్ల గౌనులు కలిసి మనల్ని చావచిదగ్గొట్టేస్తారు. మనవే ఏదో మర్డరు చేసేసినట్టు – ఇంజిక్షన్లు ఏవింటి చేశారు? ఆ ఇంజిక్షన్లే ఎందుకు చేశారు? అంత దెబ్బ తగిల్తే సూచర్సు ఎందుకు వేయలేదు? రోగిని మీ దగ్గరికి ఎన్ని గంటలకు తెచ్చేరు? తెచ్చింతర్వాత ఎన్ని గంటలకి వైద్యం చేశారు? పెద్దాసుపత్రికి వెంటనే తోలాలని తెలీదా? ఇలా యూస్‌లెస్ ప్రశ్నల్తో చెవులు మూసేస్తారు. పోలీసు డాక్టరా? ప్లీడరు డాక్టరా? అయినప్పటికీ ఆ వెధవల పుచ్చు ప్రశ్నలన్నిటికీ మనం చచ్చేటట్టు సమాధానం చెప్పాలి. ఏమిటంటే ఇలాంటి కేసుల వల్ల మొదట పోలీసులకీ, తర్వాత ప్లీడర్లకి లాభం. బ్రహ్మాండంగా లంచాలకి లంచాలు, ఫీజుల మీద ఫీజులు, డాక్టర్లకి మటుకు షియర్ పనిష్మెంట్. ఎందుకొచ్చిన పాట్లు. పోలీసులు మాటమాటకీ క్లినిక్కి రావడం, యక్ష ప్రశ్నలు వేసి నన్ను డిస్టర్బ్ చేయడం, తరువాత కోర్టు కెళ్ళడం. అక్కడ కోర్టు వారు ఏ క్షణంలో పిలుస్తారోనని ఉదయం నుంచి సాయంత్రం దాకా పడిగాపులు పడటం, మధ్య మధ్య క్లినిక్ మూతపడడం, నా వేల్యుబుల్ టైము వేస్ట్ కావడం – అంతే కాదు తరచు పోలీసులు క్లినిక్‌కి రావడం చూసి ప్రజలు వీడు డాక్టరు కాదు దొంగో, హంతకుడో, నక్సలైటో అని హడలిపోయి మరో డాక్టరుని చూసుకున్నా చూసుకుంటారు. ఆ తరువాత ఏముంది? మన ప్రాక్టీసు క్లోజ్" అని "అయ్యా అప్పారావుగారూ అదీ సంగతి – ఇంకా నేను వివరంగా చెప్పలేదు. అయినప్పటికి ఇపుడు నేనెందుకలా ప్రవర్తించానో మీకు అర్థమయి వుండాలి" అన్నాడు.

అప్పారావుకు అర్థమయింది.

మన సిస్టం 'మంచి' చేద్దామనుకునేవాణ్ణి కూడా ఎంత ఇబ్బంది పెట్టేస్తుందో తనకు తెలుసు.

అందుకే చాలామంది చాలా సందర్భాల్లో తలదూర్చబోయి మనకెందుకు లేనిపోని గొడవని దూరంగా తప్పుకుంటారు. నిజమే!

కాని -

డాక్టరు చెబుతుంది చాలా అతిశయంగా ఉంది.

గోరంత రిస్కుని కొండంతగా చిత్రిస్తున్నాడు.

మానవత్వం గురించి మాట్లాడకుండా లాభనష్టాల లెక్కలు చెబుతున్నాడు.

ఒక్క ప్రాణాన్ని రక్షించడానికి ఆ మాత్రం రిస్కు తీసుకోలేడా?

'ఇటువంటి కేసుల వల్ల పోలీసులకి, ప్లీడర్లకి లాభం... డాక్టర్లకి నష్టం అట!'

అంటే ఇదేం వ్యాపారమా?

తనకి లాభం లేనపుడు ఎలాంటి రిస్కు తీసుకోడన్నమాట.

'చాలా అమానుషం' అనుకున్నాడు అప్పారావు.

తర్వాత -

డా. రత్నాకర్ వరలక్ష్మికి రెండు ఇంజిక్షన్లు చేసేడు.

వరలక్ష్మి ఇంజిక్షన్ అంటే భయపడ్డం చూసి నవ్వేసి, "రేపట్నించి ఒక్కొక్క ఇంజిక్షన్ లెండి. నెమ్మదిగా చేస్తాను" అని హామీ ఇచ్చాడు.

రంగా ఆమె వేలుకి డ్రెస్సింగ్ చేసేడు.

అప్పారావు ఫీజు చెల్లించేడు.

వరలక్ష్మి అప్పారావు వెనుక వెళ్ళిపోయింది.

వరలక్ష్మి వెళ్ళిపోవడంతో రత్నాకర్ క్లినిక్ పూర్తిగా చిన్నబోయింది.

గదిలో మధురమైన మల్లెల వాసన పోయి మామూలు మందుల వాసన మొదలయింది.

ఆ రోజు వచ్చిన కేసులన్నిటిలో -

ఆ నాటు అప్సరస అందం, ఆ ఏక్సిడెంట్ కుర్రాడి రక్తపు తొడ రత్నాకర్‌ని కలవరపరిచేయి. తీవ్రంగా టెన్షన్‌కి గురిచేశాయి.

**- 3 -**

చంద్రం చేతులు జోడించేడు.

ఎదురుగా పటంలో లక్ష్మీదేవి

ఆ పటం మీద పూలదండ వాడిపోయి ఉంది. ఎన్నాళ్ళగో అగరొత్తులు వెలిగించి, వెలిగించి ఆ ఫ్రేం కార్నరులో గుచ్చడం చేత ఆ మేరకు అద్దం నల్లగా మాడింది. ఆ నల్లని మచ్చలు వల్ల లక్ష్మీదేవికి వాతలు వేసినట్టుగా వున్నాయి.

భక్తితో అగరొత్తులు వెలిగిస్తున్నందుకు అనుగ్రహించాలో భక్తి పేరుతో రోజూ వాతలు పెడుతున్నందుకు ఆగ్రహించాలో తెలీక ఏ దీవెన, ఏ శాపం పెట్టకుండా తటస్థంగా వుండిపోయినట్టుంది ఆ తల్లి.

అందుకే గాబోలు గత రెండేళ్ళగా చంద్రం ప్రాక్టీసు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా అలానే ఉంది.

తన ప్రాక్టీసుని ఏ నత్తనడకతోనో కాకుండా తాబేలు నడకతోనే పోల్చుకోవడం ఇష్టం చంద్రంకి.

ఎంచేతంటే ఈ తాబేలు రత్నాకర్ లాంటి కుందేళ్ళని ఎప్పటికయినా జయించగలదని నమ్మకం. గట్టి నమ్మకం.

చంద్రం చేతులు జోడించేడు.

తన తప్పు తెల్సుకున్నట్లు ఆ రోజు మాత్రం అగరొత్తులు ఫ్రేమ్ కార్నరులో గుచ్చకుండా అరటిపండొకటి వొలిచి దానికి గుచ్చేడు.

దాంతో తన తటస్థ వైఖరి విడనాడి భక్తుని కొంత అనుగ్రహించినట్టుంది లక్ష్మీదేవి.

ఆ రోజు ప్రాక్టీసు కొంత బాగుంది.

కాని చంద్రంకి తృప్తి లేదు.

తను క్లినిక్ ముందు వేలాడదీసిన బోర్డులో సంప్రదించు వేళలు సాయంత్రం 5 నుంచి 8 గంటలని వుంది.

సమయమిపుడు ఎనిమిదయ్యి పది నిముషాలయ్యింది.

కాని చంద్రం క్లినిక్ మూయలేదు.

ఇంకా రోగులు వస్తారేమోనని ఆశ.

రోగులు రావడం లేదు.

దోమలు వస్తున్నాయి.

వచ్చినవి వచ్చినట్టు వుండక చంద్రాన్ని చంపేస్తున్నాయి.

తను టేబుల్‌ఫాన్ గాలి కోసం కాకుండా ముఖ్యంగా దోమల బారి నుండి రక్షించుకోవడానికి వేసుకుంటాడు.

అయినా ఏ మూల నుంచో దోమలు కుట్టేస్తునే వున్నాయి.

టేబుల్ కిందనున్న కాళ్ళని విపరీతంగా కుట్టేయడంతో చంద్రం రెండు చేతుల్తో గోక్కుంటున్నాడు.

గోక్కుంటుండగా -

రవి వచ్చేడు.

రవి రోగి కాదు.

చంద్రానికి స్నేహితుడు.

రవీ డాక్టరే.

ఒక గవర్నమెంటు ఇండస్ట్రీకి పానెల్ డాక్టరు.

కార్మికులకు వైద్యం చేయడమే అతని ఉద్యోగం.

అందుకు జీతం ఇస్తారు.

అతను జీతం కన్నా ఎక్కువ ఆశించడు.

పై మార్గాలలో సంపాదించాలనే ధ్యాస లేదు.

ఆశ లేదు.

అతని వయసు 33 ఏళ్ళు.

రంగు కాస్త తెలుపు.

మనిషి కొంత పొడవు.

"ఏఁవిట్రా దోమల్తో ఆడుకుంటున్నావ్" అంటూ ఎదురుగా కుర్చీలో కూలబడ్డాడు రవి.

"ఆడుకోడంలేదు. గోక్కుంటున్నాను. అంతకన్న ప్రాక్టీసేం వుందిక్కడ. వురే రవీ! నన్నడిగితే – ఈ దేశంలో ధరలు తగ్గినా, తగ్గకపోయినా ఫర్లేదు గాని – దోమలు తగ్గిపోతే బావుణ్ణు. ధరల గురించి ఆందోళన చేస్తారుగాని దోమల నిర్మూలన గురించి ఎవరూ ఆందోళన చేయరేం?" అన్నాడు చంద్రం గోక్కోవడం కంటిన్యూ చేస్తూనే.

"ఎవడూ ఆందోళన చేయనందుకు సంతోషించు. ఒకరకంగా చూస్తే ప్రయివేటు డాక్టర్లు దోమలకి కృతజ్ఞత తెలుపుకోవడం న్యాయం. ఎంచేతంటావు?"

"ఎంచేత?"

"మన పట్నాలు చూడు. పట్నాల పైపై తెరలు తొలగించి చూడు. చూస్తే ఏముంది?"

"అన్నీ కొన్ని మురికివాడల సమూహం."

"అవునా? మరి మురికివాడలంటే ఏమిటి? అనారోగ్య కేంద్రాలే కదా. ఆ కేంద్రంలో దోమగారు కూడా ముఖ్యమైన ఏక్టివ్ మెంబరు. మనిషికి రోగం రావడానికి శాయిశక్తులా కృషి చేస్తుంది. తర్వాత ఆ మనిషి ఖచ్చితంగా నీ దగ్గరికి రోగంతో వస్తాడు. రాకపోతే చస్తాడు. అంచేత ఒరే చంద్రం దోమని చిన్నచూపు చూడకు. నిర్మూలించాలనకు. నీ ప్రాక్టీసు గోవిందా అయిపోతుంది."

"ఇపుడు కానట్టు!" అని "ఒరే రవీ అసలు దోమల నిర్మూలన అన్నది అసలు సాధ్యమా, అసాధ్యమా చెప్పరా బాయ్" అన్నాడు చంద్రం.

"కొన్ని కొన్ని దేశాల్లో సాధ్యమయింది. ప్రయత్నించాలే గాని ఏ దేశంలోనైనా అది సాధ్యమే."

"ఏ సంపన్న దేశాలలోనో సాధ్యమయ్యుంటే అయ్యుండొచ్చుగాని బడుగు దేశాల్లో మాత్రం అది అసాధ్యంరా"

"నీ మొహం. చైనా సంగతి తీసుకో. ఒకప్పుడు మనకన్న పేద దేశమది. అక్కడ పందెం వేసుకొని వెదికినా ఒక్క దోమ కూడా కన్పించదట. దానికేమంటావ్? చైనాలో సాధ్యమైంది మన దేశంలో ఎందుకు సాధ్యం కాదు?"

"దోమలకి కమ్యూనిస్టు దేశాలంటే గిట్టదేమో... సరేగానీ ఇక దోమ పురాణం ఆపేసేయ్.

కథా నిలయం శ్రీకాకుళం

నేను చెప్పేది విను" అన్నాడు చంద్రం.

"ఆపేసాను. చెప్పు"

"మొన్న లక్ష్మీ క్లినిక్‌లో పెద్ద గొడవయ్యిందట తెల్సా."

"తెలీదు."

"నాకూ తెలీదు.. నిన్న రంగా చెప్పేవరకూ."

"రంగా ఎవడు?"

"మనోడే. రత్నాకర్ దగ్గర కంపౌండరు. విశేషం ఏమైనా వుండాలేగాని మనకు చెప్పకుండా వుండడు."

"ఏమిటి చెప్పాడు?"

"రత్నాకర్ బలే దెబ్బకి దొరికిపోయేడట. స్కూటర్ ఏక్సిడెంట్ కుర్రాడి కేసట. ఆ కుర్రాణ్ణి క్లినిక్‌కి తీసుకెళ్ళి ఎంత రిక్వెస్టు చేసినా రత్నాకర్ కాకనేకాదు, ఆ కేసు ఎటెండు కాననేశాడట. పెద్దాసుపత్రికి తీసుకుపొమ్మని ఒక ఉచిత సలహా పారేశాడట. పాపం ఆ కుర్రాడు ఆన్ ద వే హాస్పిటల్‌కి వెళ్ళకముందే చచ్చీసేడట. ఆ చచ్చిన కుర్రాడు స్టూడెంటు కుర్రాట్ట! దాన్తో రత్నాకర్ చిక్కుల్లో పడిపోయేడు. ఇరవై మంది స్టూడెంట్సు అమాంతంగా లక్ష్మీ క్లినిక్ మీద పడిపోయేరట. నాదేం తప్పు లేదని రత్నాకర్ మొదట్లో గట్టిగా నిలబడినా వాళ్ళ ధాటికి తట్టుకోలేకపోయేడట. తన లెంపలెక్కడ వాయించేస్తారో అని భయమేసి ముందే తన లెంపలు వాయించేసుకున్నాడట. తప్పయిపోయింది, క్షమించమని ప్రాధేయపడ్డాడట. స్టూడెంట్సు క్షమించేసి 'ఇక మీదట ఇలా జరిగితే ఇక్కడ నీవు, నీ క్లినిక్ వుండవు జాగర్త' అని వార్నింగ్ ఇచ్చేసి వెళ్ళిపోయేరట. ఆ గొడవ గుప్‌మని గోపాలపురమంతా పాకిపోయింది. డాక్టరలా నిర్దాక్షిణ్యంగా, అమానుషంగా ప్రవర్తించకుండా వుంటే పాపం ఆ కుర్రాడు బతికేవాడంటే బతికేవాడు కదా అని బాధపడుతున్నారట. కొందరైతే తిడుతున్నారట కూడా. అదీ సంగతి. అంచేత నేను అనుకుంటున్నదేమిటంటే దీనివల్ల డెఫినెట్‌గా రత్నాకర్ ఇమేజ్ చెడుతుంది. ఇమేజ్ చెడితే ఇంకేముంది? ప్రాక్టీసు దెబ్బతినేస్తుంది. దట్సాల్."

"నిజంగా దెబ్బ తింటుందో లేదోగాని – నీ ఉత్సాహం చూస్తుంటే అతని ప్రాక్టీసు దెబ్బ తినేయాలనే నీవు కోరుకుంటున్నట్టు కన్పిస్తోంది."

"కోరుకుంటే మాత్రం అయిపోతాయేవిఁట్రా"

"అయిపోతుందంటే కోరుకుంటావా?"

"ఖచ్చితంగాను."

"ఎంచేత?"

దానికి సమాధానం ఉద్వేగంతో చంద్రం చాలా చెప్పేడు.

చంద్రం వయసు ముప్ఫయి రెండు. నిరుద్యోగిగా ఆరేళ్ళు.

నిరుద్యోగ పట్టభద్రుల సంఘం సహాయ కార్యదర్శిగా ఒక ఏడు.. చివరికి ఈ వూళ్ళో

క్లినిక్ తెరుచుట - రత్నాకర్ ప్రాక్టీసు జోరు తెలిసి కూడా.

తనకొకటే హోప్.

ఈ వూళ్ళో తన కులం వాళ్ళ సంఖ్య చాలా చాలా ఎక్కువ.

సో, కులాభిమానంతో రోగుల్ని ఆకర్షించలేకపోతానా... ఆశ..

కులతత్వంతో ఈ దేశంలో దేన్నయినా కూలదీయవచ్చు. అలాగే దేన్నయినా సాధించనూ వచ్చు. మరేదో కులస్థుడైన రత్నాకర్ ఉచ్చులో చిక్కుకుపోయిన తన కుల ప్రజలు (రోగులు) ఎప్పుడొకనాడు ఏదొక బలమైన, అద్భుతమైన సంఘటనతో రూటు మార్చి తన వైపు తిరగకుండా పోలేరు గాక పోలేరు అనే గట్టి నమ్మకం. అంచేత తన కులం వాళ్ళతో పరిచయాలు పెంచుకొనుట, స్నేహాలు చేయుట, కుల సంఘాలు, యువజన సంఘాలతో కాంటాక్ట్సు పెట్టుకొనుట సాగిస్తున్నాడు; కొనసాగిస్తున్నాడు.

రోగుల్ని ఆకర్షించే గ్లామరు రత్నాకర్ దగ్గర వున్నదేవిఁటి?

తన దగ్గర లేనిదేవిఁటి?

మిగతావి ఏవే కారణాలు వున్నా ముఖ్యంగా రత్నాకర్ గవర్నమెంటు డాక్టరై వుండటమే అసలు కారణమని చంద్రం అభిప్రాయం.

'గవర్నమెంటు డాక్టరు వద్ద ట్రీట్‌మెంట్ తీసుకుంటే - అవసరమైతే ఆ డాక్టరు పెద్దాసుపత్రిలో చేర్పిస్తాడు. ఆపరేషన్లు చేయిస్తాడు. ఎక్స్‌రేలు తీయిస్తాడు. ఎలా? అవన్నీ గవర్నమెంటోడు కర్సు మీద. అంటే ఏటి? గవర్నమెంటు ఆసుపత్రంటే ఆళ్ళ సొంత నర్సింగ్‌హోమ్ కిందే లెక్కన్నమాట. అయితే ఇవన్నీ బోడి ప్రయివేటు డాక్టరు ఇంత చవకలో చేయించగలడా? చేయించలేడు గాక చేయించలేడు' అనే అభిప్రాయంలో వుంటాడు రోగి.

తను గవర్నమెంటు డాక్టరు కాదు.

కాని గవర్నమెంటు డాక్టరనే గ్లామరు కోసం తనేం చేయాలి? - ఆలోచించాడు.

ఆలోచించి తన క్లినిక్ ముందు తన బోర్డుతో పాటు, శ్రీధర్ బోర్డు కూడా పెట్టాడు.

శ్రీధర్ గవర్నమెంటు డాక్టరు!

అయితే అక్కడ శ్రీధర్ మాత్రం వుండడు. అక్కడకి అసలు ఎప్పుడూ రాడు. రావల్సిన ఖర్మ అతనికి లేదు. అతనికి బ్రహ్మాండమైన డిస్పెన్సరీ టౌన్లో ఉంది.

అంచేత అక్కడ చంద్రమే శ్రీధర్. అంతే.

గవర్నమెంటు డాక్టరు యొక్క బోర్డు, పేరు, స్టాంప్ ఉపయోగించుకుంటున్నందుకు శ్రీధర్‌కి కొంత 'పే' చేస్తాడు చంద్రం.

ఎంతనేది, ఎలాగనేది అదంతా వ్యాపార రహస్యం. చంద్రం చెప్పడు.

మెడికల్ క్లయిమ్ ఫారాలు శ్రీధర్ నుంచి చంద్రం వందో, రెండు వందలో ప్రతి నెల హోల్‌సేల్ రేటుపై తీసుకుంటాడు. ఆ ఫారాలపై ముందే శ్రీధర్ సంతకం, స్టాంప్ వుంటాయి.

చంద్రం దగ్గరికి దగ్గర్లోనే వున్న సెంట్రల్ గవర్నమెంటు ఎంప్లాయిస్ (రోజుకి

నలుగురైదుగురు మినిమమ్) వస్తారు. ఉద్యోగుల జీతాల బట్టి ఫస్టు కన్సల్టేషను 3 నుంచి 5, సెకండు కన్సల్టేషను 2 నుంచి 3, ఒక్కొక్క ఇంజిక్షనుకి 2 లేక 3 ఛార్జి చేయవచ్చు. అంచేత ఏ చిన్న రోగానికైనా చంద్రం ఎంప్లాయిస్ నుంచి 2 కన్సల్టేషన్లూ, 5 ఇంజక్షన్లకి ఫీజు వసూలు చేయకుండా వదిలేయడు. కొంతమంది ఎంప్లాయిస్ చంద్రంకి ఇవ్వాల్సిన ఫీజు ఇచ్చేసి తమకు కావల్సిన మందులేవో వ్రాయించుకునేవాళ్ళున్నారు. చంద్రంకి కావల్సింది ఫీజే కాబట్టి ఏ మందులు వ్రాయమన్నా వ్రాస్తాడు. డబ్బుకి దొంగ సిక్ సర్టిఫికెట్లు ఇస్తాడు.

ఈ మధ్య ఇంకో రకంగా కూడా సంపాదిస్తున్నాడు. ఒక మందుల దుకాణంని మంచి చేసుకొని ఏదో ఒప్పందం మీద దొంగ రశీదులు ఏవేవో మందులు కొన్నట్లు పుట్టిస్తాడు. ఆ మందులు ఆరోగ్యంగా వున్న ఏ ఎంప్లాయికో లేక ఆ ఎంప్లాయి పెళ్ళాంకో, తల్లికో, తండ్రికో, కొడుక్కో కూతురికో 'రోగం' బలవంతంగా సృష్టించేస్తాడు. ఉద్యోగి తనకి, తన వాళ్ళకి లేని రోగం ఉంది వుందని ఒప్పేసుకోడానికి, కొనని మందులకి 'అవునవును నేనే కొన్నాను, వాటి రశీదులే ఇవి' అని ఒప్పేసుకోవడానికి, 'అయ్యబాబోయ్ దొంగ బిల్లు పెట్టి గవర్నమెంటుని మోసం చేయలేను' అని ఏడ్చే, భయపడే అంతరాత్మల నోరు మూయించడానికి చంద్రం పెద్ద కష్టపడడు. అది కాదోయ్, క్లయిమ్ చేసిన ప్రతి పైసా నీవే తీసుకో - కానీ నేను ఇంత కష్టపడినందుకు అందులో 50 పర్సంటు మాత్రం నాకు పారెయ్ చాలు' అని అంటాడు. ఆ విధంగా చంద్రం 'కష్టానికి' పైకం ఎప్పటికప్పుడు ఎంప్లాయిస్ చెల్లించేస్తారు. చెల్లించేసి 'సార్ నేను చాలా కష్టంలో వున్నాను. డబ్బులవసరం మీరు కొద్దిగా 'కష్టపడాలి' అనే వరకూ వచ్చేరు కొందరు ఉద్యోగులు.. ఇదీ చంద్రం ప్రాక్టీసు!

"ఇంత మాయలు చేసి, ఇన్ని వేషాలు వేసినా రాబడి ఏమి వచ్చి పడిపోతోంది? రత్నాకర్ ప్రాక్టీసుతో నా ప్రాక్టీసు కంపేర్ చేస్తే నా రాబడి నథింగ్ అన్నమాట. అంచేతనే రత్నాకర్ ప్రాక్టీసు దెబ్బతినేటట్టుగా ఉంటే...యస్, యస్, దెబ్బతినాలనే కోరుకుంటున్నాను. అందుకు దేవుణ్ణి కూడా ప్రార్థిస్తున్నాను. గోపాలపురంలోని ప్రజలకి రోగాలు వస్తే నాకేం అభ్యంతరం లేదు. రోగాలతో వర్ధిల్లాలనే నా కోరిక కూడా. కాని వాళ్లకి రోగం రావడం భయం తిన్నగా రత్నాకర్ దగ్గరికే పారిపోతున్నారు! మరిక నా లాంటి ప్రయివేటు ప్రాక్టీసుగాళ్ల గతేంటి? రత్నాకర్ ప్రాక్టీసు పడిపోవాలని కోరుకోవడంలో తప్పేమిటి?" అన్నాడు ఉద్వేగంగా చంద్రం.

"తప్పే. తప్పు నీతోబాటు ఈ సొసైటీది కూడా! అవర్ సొసైటీ ఈజ్ సచ్. కాంపిటీషన్. కాంపిటీషన్. ప్రతిదీ కాంపిటీషన్. నీ ప్రాక్టీసు బాగుండాలంటే ఎదుటివాడి ప్రాక్టీసు పడిపోవాలి"

"ఆ పరిస్థితులకు కారణం నిరుద్యోగం కాదంటావా? ఈ దేశంలో ఇంతమంది జనాభాకి ఇంతమంది డాక్టర్లు మాత్రమే వుండాలని నిర్దుష్టమైన పథకమేమీ లేకపోవడమే ఈ పరిస్థితులకి కారణం. నిరుద్యోగులున్నప్పుడు ఇంకా నిరుద్యోగుల్ని ప్రొడ్యూస్ చేయడమెందుకు? వున్న మెడికల్ కాలేజీలు చాలవన్నట్లు కొత్త కొత్త కాలేజీలు ఇంకా లేవడం ఎందుకు? బెటర్ క్లోజ్

ద కాలేజస్ ఫర్ సమ్ టైమ్" అన్నాడు సిగరెట్ వెలిగిస్తూ చంద్రం.

"ఇటీజ్ నాట్ సో ఈజీ రా. అందరికి మంచి చేసే ఒకపని తలపెడితే అది ఖచ్చితంగా కొందరి ప్రయోజనాలనీ, స్వలాభాలనీ దెబ్బతీస్తుంది. యస్. డెఫినెట్‌లీ. మన సిస్టంలో వున్న గొప్పతనమే అది. నీవు సిగరెట్ కాల్చేసి పారేసినంత ఈజీగా 'తీసేస్తే పోలా, చేసేస్తే పోలా' అంటే అయ్యే పనులు కావు మనవి. అయినా – నీవు అనుకున్నట్టుగా మన విద్యాలయాలు డాక్టర్లని ఎక్కువ ప్రొడ్యూస్ చేసేయడం లేదు. ఆ మాట కొస్తే ఆవర్ కంట్రీ ఈజ్ బాడ్లీ ఇన్నీడ్ ఆఫ్ సోమెనీ డాక్టర్స్. మనకి డాక్టర్ల కొరత చాలా వుంది."

"ఒరే నీవేం మాట్లాడుతున్నావో నీకు తెలుస్తోందా? మనకి డాక్టర్ల కొరతేవిట్రా బాబూ. గవర్నమెంటే లెక్కలు వేసి చెప్పింది 80 వేలకి పైగా డాక్టర్లు నిరుద్యోగులున్నారని. అయినా మనకి తెలీన్దేటుంది? నిరుద్యోగ సంఘాలు, నిల్ ప్రాక్టీసులూను."

"అరె స్టుపిడ్. ఈ దేశానికి డాక్టర్ల కొరత ఉందన్నానే గాని నిరుద్యోగులు లేరనలేదే?" అన్నాడు రవి.

పకపకానవ్వేడు చంద్రం.

"ఇది మరీ బాగుందోయ్. కాని నాకు అర్థం కావడం లేదని తెలియజేయడానికి విచారిస్తున్నాను బ్రదర్."

"ఏడ్చినట్టుంది. నే చెప్పేది పూర్తిగా విను. ఆ మధ్య ఒక నివేదిక చూశాను. మన దేశంలో అర్బన్ ఏరియాలో ప్రతి ఏడు వేల మందికి ఒక డాక్టరున్నాడు. అదే రూరల్ ఏరియా అయితే ఎంతమంది జనాభాకి ఒక డాక్టరున్నాడో తెల్సా? పాతిక వేల మందికి. అదీ పరిస్థితి. అయితే న్యాయంగా ఎంతమంది జనాభాకి ఒక డాక్టరుండాలి? 500 మందికి. ఒన్ డాక్టర్ అట్‌లీస్ట్ ఫర్ ఎవ్విరీ ఫైవ్ హండ్రడ్ పీపుల్, అర్థమయిందా. ఆ లెక్క ప్రకారం చూస్తే మనకి డాక్టర్ల కొరత ఉందా లేదా?"

చంద్రం వెంటనే జవాబు ఇవ్వలేకపోయాడు.

"నీవేవో ఫిగర్సు ఇచ్చి ఢంకా బజాయించి చెబితే నేను కాదనలేకపోతున్నాను గాని... ఇంకా నాకు అయోమయంగానే వుంది" అన్నాడు.

"ఎందుకయోమయం?"

"రూరల్ ఏరియా గురించి మనకెందుగ్గాని.. అర్బన్ ఏరియా క్రయిసిస్".

"రూరల్ ఏరియా అని అంత తేలిగ్గా తీసిపారేయకు. గ్రామీణ ప్రాంతం నెగ్‌లెక్టు చేయాల్సినంత సామాన్య విషయం కాదు. మన టోటల్ పాప్యులేషన్‌లో 80 పర్సెంటు కేవలం గ్రామీణ వాసులు, మన రాష్ట్ర జనాభా 5 కోట్లలో 4 కోట్ల మంది గ్రామస్తులే. రూరల్ ఏరియా అన్ని రంగాల్లో లాగే వైద్య రంగంలో కూడా పూర్తిగా నిర్లక్ష్యం చేయబడింది. తెల్సా"

"ఒరే రవీ, ఆ గ్రామాలకో దండం. నాకు తెల్సు – నీవు మమ్మల్ని గ్రామాలకి పోరాదా

అని అంటావు. కాని అక్కడ ఎవరూ వుండలేరు. సరైన ఇల్లా? ఒక సెప్టిక్ లెట్రినా? పిల్లలకో పబ్లిక్ స్కూలా? ఒక కరంటా? ఒక రిక్రియేషనా? ఏముందని వెళ్ళమంటావురా బాబూ."

"నీవు చెప్పిన ఫెసిలిటీస్ ప్రొవయిడ్ చేస్తే గ్రామాలకి వెళ్తారా?"

"ప్రొవయిడ్ చేసినప్పటి మాట కదా. ఏమైనా బ్రదర్ అర్బన్ లైఫ్‌కి అలవాటు పడిపోయాం. అటువైపు వెళ్ళలేం రా నాయినా... మమ్మల్ని ఇలా బతకనీయ్. ఇందాకల నీవు పట్టణాల్లో ప్రతి ఏడు వేల మందికో డాక్టరున్నాడన్నావ్. ఆఫ్‌కోర్స్. ఏవరేజ్ కడ్తే వచ్చిన ఎప్రాక్సిమేట్ ఫిగరే అనుకో. అయినప్పటికీ ఆ లెక్క ప్రకారం చూస్తే అర్బన్ ఏరియాలో మనకి డాక్టర్ల కొరతే. మరలాంటప్పుడు నాలాంటి వాళ్ళ ప్రాక్టీసు బాగుండాలి కదా".

"నీవడిగిన ప్రశ్న బాగుంది. ప్రాక్టీసు బాగుండాలని కదా అన్నావు. దాని అర్థమేమిటి? దాని లిమిట్స్ ఏమిటి? నీ ప్రాక్టీసు మీద నీకెంత ఆదాయం రావాలి? నా కొచ్చినంతా? లేక రత్నాకర్‌కి వచ్చినంతా? ఎంత కావాలి?.. అయినా 500 మందికో డాక్టరుండాలనేది నీ ఆదాయం కోసం కాదు, ప్రజల ఆరోగ్య సదుపాయం కోసం."

"బాగుందిరా బాబు" - చంద్రం చప్పబడిపోయేడు.

"మనది లోపభూయిష్టమైన వ్యవస్థరా. అంతా ఎగుడు దిగుడులు, అన్నీ ఎత్తుపల్లాలు. నీరెప్పుడూ పల్లంకే పోతుంది కదా. ఒక్క నీటిచుక్కయినా నీకు దక్కకుండా రత్నాకర్‌కి అవసరం కన్నా ఎక్కువగా, చాలా ఎక్కువగా పోతోంది - అంచేత ఏం చేయాలి? ఎత్తుపల్లాలు లేకుండా సమంగా చదును చేయాలి. అపుడు నీరు అన్ని వైపుల సమంగా ప్రవహిస్తుంది. సమంగా అందర్కీ దక్కుతుంది. అవునా".

"ఒకే. నీవన్నది రైటే. రివల్యూషన్ వస్తే తప్ప ఈ ఎత్తుపల్లాలు సమం కావని కూడా నీ వంటావు. దానికి నేనూ ఒప్పుకుంటాను. అయితే అది యిప్పుడే వచ్చేటట్టు లేదు కదా - అందాకా ఏం చేయడం?"

"అనుభవించడమే లేదా విప్లవానికి సహకరించడమే"

"అలాగనేస్తావేమిటి?"

"ఏం చేస్తాం? చస్తామా."

"లేదు. నీవన్నదానికి నేను ఒప్పుకోను. ఈ చీకటి బతుకుల్లోకి సూర్యుడెపుడో ఎర్రగా ఉదయిస్తాడన్జెప్పి తూర్పుకి తిరిగి అలా ఎదురుచూస్తూ కూర్చోడం సినిమాటిక్‌గా గొప్పగా వుంటుంది గాని ప్రాక్టికల్‌గా అది వట్టి యూస్‌లెస్. నా థీరీ ఏటంటే ఎవడి బతుకులు వాడు వెలిగించుకోవాలి. ఎవడి ఇల్లు వాడు చక్కబెట్టుకోవాలి. దట్సాల్" అంటూ కుర్చీలోంచి లేచేడు చంద్రం.

లేచి, రెండు అరచేతులతో దబ్‌మని చప్పుడు చేశాడు. దోమ చచ్చింది! దోమ రక్తం చూసి తృప్తి చెందేలోగానే మరో దోమ చంద్రంపై తీవ్రంగా దాడి చేసింది. ముక్కులోకి దూరిపోయి ముప్పతిప్పలు పెట్టేసింది.

## - 4 -

క్లినిక్ మూసేసి రోడ్డెక్కారు చంద్రం, రవి.

రోడ్డుపై జనసంచారం పలచబడింది.

రోడ్డు కిరువైపులనున్న దుకాణాలు మూయాల్సిన టైము అయినప్పటికి - మూయబడకుండా కష్టమర్సుతో, కష్టమర్సు వస్తారు, వస్తారన్న ఆశతో వున్నాయి; ఎదురు చూస్తున్నాయి.

రవి అనుకున్నాడు - 'వేశ్యలు రాత్రులు మాత్రమే బజార్లో నించుంటారు. దుకాణాలు మాత్రం రాత్రీ పగలనకుండా రండి, రండంటూ నిలబడతాయి. ఎంతమందొచ్చినా తృప్తిలేక ఇంకెంతమందో రావాలని కోరుకుంటాయి.

ఒకే సరుకు అమ్మే దుకాణాలు నా సరుకు మంచిదంటే నా సరుకు మంచిదని పోటీపడి కొట్టేసుకుంటాయి.

ఒక దుకాణం యొక్క విజయవంతమైన వ్యాపార కీలకాన్ని మరో దుకాణం అచ్చంగా, అలానే కాపీ కొట్టేయడానికి ఏ మాత్రం సిగ్గుపడనంటాయి.

ఎదుటి వాడి దుకాణం సర్వనాశనం కావాలని కోరుకుంటాయి. అందుకు దేవుణ్ణి ప్రార్థిస్తాయి. నా దుకాణం మాత్రమే బాగుపడాలంటాయి.

అంతే కాదు -

కష్టమర్సుని ఆకర్షించాలని ముండలా ముస్తాబవుతాయి.

ఏమిటేమిటో సింగారించుకుంటాయి.

ఎన్నెన్నో హంగులు చేస్తాయి.

ధగధగలాడిపోతాయి.

జిగేల్ జిగేల్ మంటాయి.

ట్యూబ్‌లైట్లతో పట్టపగలనిపిస్తాయి.

ఫలానా కొంటే ఫలానా ఉచితం అంటాయి.

రిబేటు వుందంటాయి.

ఇన్‌స్టాల్ సిస్టముందంటాయి.

రండి సార్ రండంటాయి.

రండి తల్లుల్లారా రండి, రండంటాయి...'

రవి నవ్వుకున్నాడు.

రవీ, చంద్రం నడుస్తున్నాడు.

అంతలో -

చంద్రం టక్‌మని ఆగిపోయేడు.

రవి కూడా ఆగిపోక తప్పలేదు.

చంద్రం బోల్డు ఆశ్చర్యపోయి, కొయ్యబారి అలా వుండిపోయేడు.

అలా ఆశ్చర్యపోతున్న చంద్రంని చూసి రవి ఆశ్చర్యపోయేడు

లక్ష్మి క్లినిక్ మూసి వుంది!

ఇది సామాన్య విషయం కాదు.

చంద్రం ఇన్నాళ్ళకి ఇదే చూడ్డం లక్ష్మి క్లినిక్ మూసి వుండగా.

సమయం ఎనిమిదిన్నర కూడా కాలేదు.

అక్కడ డాక్టరు లేడు. రోగుల్లేరు. కంపౌండరు రంగా మాత్రం వున్నాడు.

సంగతేవిఁటో రంగాని అడుగుదాం అన్నాడు చంద్రం.

"నీ వెళ్ళి అడుగు. అదిగో ఆ కిళ్ళీ బడ్డి దగ్గర నేనుంటాను. సిగరెట్లు లేవు. వేగంరా. లేకుంటే నే పోతాను" అన్నాడు రవి.

"ఎందుకూ ఒక్క నిముషంలో వచ్చేస్తాను. ప్లీజ్ వెయిట్" అంటూ రంగా దగ్గరికి పరుగు తీశాడు చంద్రం.

"ఏం రంగా అప్పుడే క్లినిక్ మూసేసారేం?"

"మూసేయడానికసలు తెరిస్తే గదేటి?" పళ్ళికిలించేడు రంగా.

"ఏం?"

"ఈ రోజు డాట్రుగార్కి అర్జెంటు పనుండి క్లినిక్కిప్పలేదు. ఏటనుకోకండి. దయచేసి రేపు రండి అని నన్ను చెప్పమన్నాడు మావోడు. (మావోడంటే రత్నాకర్)"

"ఎవర్తో"

"రోగుల్తో"

"రోగులికి చెప్పు. నాక్కాదు. నాకు మాత్రం అసలు కారణం చెప్పు."

"మీక్కాపోతే ఇంకెవరికి చెప్తాను సార్. రేపు మావోడికి సలాం కొట్టేసి మీ దగ్గరే పనిచేయాల్సినోణ్ణి కదా. ఏటి?"

"అస్సరేలేవోయ్. అసలు కథేదో చెప్పు."

లక్ష్మి క్లినిక్ ఈ రోజు మూతపడ్డమే మన క్లినిక్కి కాస్త కళ కళన్నమాట. బాగుందయ్యా బాగుంది.

"అబ్బబ్బా రంగా చెప్పవయ్యా అసలు జరిగిందేవిఁటో–"

"చెప్తాను సార్ ఎందుకు చెప్పనూ? కాని చెప్పేది మీరు విండవేగాని మద్దెమద్దెన అడ్డుపుల్లలేయకండి సార్. మీరు అడ్డేరంటే కథ ఆగిపోద్ది" అంటూ బెదిరించేడు రంగా.

రంగా బెదిరింపుకి చంద్రం బెదిరినట్టు నటించేడు.

దాంతో రంగాకి హుషారు వచ్చింది.

"సార్! మీరెప్పుడైనా లచ్చిమి... వరలచ్చిమి పేరు విన్నారా" అన్నాడు.

చంద్రం వినలేదన్నట్టు తలూపేడు.

"పోని సార్ దాని ముకం చూసినారా... అన్నట్టు దాని పేరే తెల్దన్నారు. ఇక ముకవేటి చూసుంటారు? కాని సార్ మీరు నిజంగా దాని ముకం చూడాల సార్. దాన్ది ముకం కాదు సార్ చంద్రబింబవన్నమాట. ఇక గుండెలా సార్. అబ్బో. అవి గుండెల్కావు సార్ కొండలు, జోడు కొండలన్నమాట.

మీరు చెబితే నమ్మరుగాని సార్.. దాని నడుపు ఇంతంటే ఇంతే వుంటుంది సార్. దాన్నడుపు నవనవలాడుతూ మీది బరువు జవజవలాడుతూ ... సార్... ఆ గుంటని ఎనకనుండి చూసినా, ముందునుండి చూసినా సార్... మన కంకటాలోడి కొట్టులేదు సార్.. ఆ కొట్టు మీద అద్దాల బీరువాలో అందాల మోడలున్నాది కదసార్... కచ్చితంగా అలాగే వుంటాది సార్.

దాన్ని చూస్తే సార్ చెందూరాం మిఠాయి దుకాణం గుర్తుకొస్ది సార్. రసగుల్లా, జీలేబి, గులాబ్‌జాం, హల్వా, కోవా ఇయ్యన్నీ పేర్చి పెట్టిన అద్దాల బల్లలా గుంటది సార్.

పుష్టిగా మేతుండి, మాంచి సంరక్షణుండి ఏపుగా పెరిగిన పల్లెటూరి పడ్డలా వుంటాది సార్ ఆ పిల్ల.

ఆ పల్లెటూరి పడ్డ ఈ మద్దెనే ఈ ఊళ్ళోకి దిగేసింది సార్. యెంకటప్పారావు – మన కులవోడే – ఆడి పెళ్ళంగా ఈ ఊళ్ళోకి దిగేసింది సార్.

కాని ఎర్రిపీనుగు అప్పారావు గోడు ఆ మిఠాయి బల్లని, మావోడి ముందుపెట్టేశాడు సార్.

మావోడు మిఠాయిని చూసి తినాలన్నంత బాగుందనుకోడు సార్.

తినేసినాకే బాగుందనే రకం సార్.

ఆ మిఠాయి మనకి చెందింది కాదు, పరాయోడిదని కాన్నే కానడు సార్. ఎలాగోల తినేసేదాక, చప్పరించేసేదాక ఒల్లకోడు సార్. అవున్సార్ అప్పటిగ్గాని ఆడి ఒళ్ళు సల్లబడ్డు.

మావోడు డబ్బులు సంపాయించే యంత్రవని మీకు తెల్సు సర్. అంతకు తప్పించి మీకేటి తెల్సుసర్?

కానాడు నేతిమిఠాయి అదిగో అంటే నేలపడి నాకేస్తాడు సార్. పెద్దొరసపడ్డలన్జూసి పడి చచ్చిపోతాడు సార్.

కాని గమ్మత్తేటంటే ఆడలా కనబడ్డు సార్.

ఇక్కడ ఇంకో పాయింటు వుంది సార్. ఆడికి ఆడదాని సుఖం కావాలి. రయిటే. కానాసుకం ఆడి యాపారానికి అడ్డొస్తే, లేక అడ్డొచ్చినట్టు కన్పిస్తే యేమామాలిని వొచ్చినా సరే దాని ముకం చూడ్డు. ముందు తన యాపారం. ఆ యెనకే ఆడది. అది సార్ పోయింటు.

డబ్బు కూడబెట్టడం ముక్యంగాని... డబ్బుంటే ఎందరాడోళ్ళనయినా కొనొచ్చుకద సార్. అయితే సార్ – ఆడు డబ్బుకి ఆడదాన్ని కొంటున్నాడని అనుకోను సార్. అవున్సార్.

అన్నీ యప్పస్ బేరాలే. మాఅయితే ఫీజు ఇచ్చుకోడు సార్. పీజిచ్చుకోడంటే పడుకోడానికి

సిద్ధమయినోళ్ళు ఈ దరిద్రదేశంలో బోల్డుమంది కద సార్.

మనోడు చాలా కేసులు అతల రోగులుండగానే ఈతల పరీక్ష గదిలో పని కానిచ్చేస్తున్నాడని నాకు పెద్ద అనుమానం సార్. అవున్సార్ ఆ గది గోడల్కి మాటలొస్తే సార్ ఎన్నెన్ని రంకు కేసులు చెప్పుద్దో, ఎన్నెన్ని బూతు కతలు చెప్పుద్దో సార్.

ఇంతకీ ఏటంటే సార్ ఆడికి బిజినెస్ కావాల. దుకాణాని కొచ్చిన అందమైన ఆడోళ్ళు కూడా కావాల.

ఇంతదాకా బిజినెస్ చెడకుండా, దొరికిన గుంట నొదలకుండా సీక్రెట్‌గా యవ్వారం సాగించేసినాడు సార్. ఆటలు ఆడేసినాడు సార్. కాని ఈ పెద్దొరస పద్దకాడ మాతరం మనోడి ఆటలు సాగినాయి కాదు సార్.

ఇన్నాళ్ళూ ఆడగుంటకాడ అంచనా తప్పిపోకుండా, కళ్ళు మూసుకుపోకుండా జేగర్తగా యెనకా ముందు చూస్కొని... దాని ఇష్టం అయిష్టం తెల్సుకొని నెమ్మది, నెమ్మదిగా దిగినోడు ఈ పాలి అనుకోకుండా పప్పులో కాలేస్సినాడు సార్.

దభేల్మని వూబిలోకి పడిపోనాడు సార్.

ద్వారవేం అనుకొని ధామ్మని అద్దాన్ని గుద్దేసినాడు సార్.

ఆ చెంద్రబింబముకాన్ని, ఆ జోడు కొండల గుండెల్ని, కంకటాల కొట్టోడు బొమ్మని, ఆ మిఠాయి బల్లని చూడగానే ఇంత జేగరత అయినోడి కళ్ళు మూసుకుపోనాయ్ సార్. కిందా మీదా చూస్కోకుండా అందుకుందారని గభాల్న పరిగెట్టి దభేల్న పడిపోనాడు సార్.

పడిపోనోడ్ని ఆ పద్ద కుమ్మేసి, తొక్కేసి జడొత్తిపోయి లగెత్తేసింది సార్. అదే పరుగు.

ఇంతకీ ఏటయ్యిందంటే సార్ –

ఆ పెద్దరొసపద్ద – లచ్మి కాలుకి చిన్న దెబ్బ తగిల్తే దాన్ని యెంటబెట్టుకొని దాని మొగుడు మావోడి కాడికి పారొచ్చినాడు సార్. ఆడి కరమ కాలిందని నేనప్పుడే అనుకున్నా సార్. మనోడు దురిద్దేశంతోనే దాన్ని రోజూ ఇంజిక్షన్లకంటూ రమ్మన్నాడని నా కరదవైం పోయింది సార్.

మొదట రెండ్రోజులు మొగుడ్తో వచ్చినాది సార్.

ఆ తర్వాత మొగుడు గాడికేదో పనితగల్డం వల్ల గావాల సార్ ఒక్కతే వచ్చేది.

రోజూ వచ్చే ఆ అమాయకపద్ద ఆడి యిశ్వరూపం జూస్సింది సార్. ఎప్పుడంటే – ఎప్పుడో కాదు సార్. నిన్నే.

ఏటయిందంటే... ఆ టయిములో రోగులెవరూ లేరు సార్.

వున్న ఇద్దరు, ముగ్గుర్ని బేగ తగిలేసినాడు సార్.

నన్నేదో పని మీద బయటికి పంపేసినాడు సార్. ఈడి ఏసికాలు మనకి తెలవ్వనుకున్నాడు గావాల. నేను ఎల్నిట్టె ఎళ్ళి పారొచ్చేసాను సార్.

పారొస్తే ఏటుంది సార్?

మనోడు లేడు. పద్దని పరీక్ష గదిలోకి పట్టికెళ్ళిపోయాడని నా కర్థమైంపోయింది సార్.

అంతలో -

లోపలున్న పద్ద జడొత్తిపోయినట్టుంది సార్. వజవజ వణికిపోయినట్టయింది సార్.

'ఓలమ్మోలమ్మో' అని కేక ఇనబడ్డాది సార్. అంతే.

ఆయెనక పులి గుహ తలుపులు దబ్‌మని తెరుసుకోడం, చెంగనాలేస్తున్న పద్దలా లచ్‌మి గుహలోంచి పైకి చెంగున దూకడం, ఎనక నుంచి పులి వచ్చి దాన్ని కాళ్ళని పట్టేసుకోడం, పద్ద దుబ్బుమని కింద పడిపోడం, పడిన పద్ద బయ్యంతో కేకలెడుతూ, ఒక తోపు తోసి తీసిపెట్టి తన్ని, కాళ్ళు విదిల్చుకొని గభాల్న లేచి గిజగిజలాడిపోతూ, బెక్కు బెక్కున ఏడుస్తూ అదే పరుగున పోడం అంతా ఒక్క మినేట్ల జరిగిపోనాది సార్.

పద్ద బలంగా తన్నిందేమో గోడ మూలన పడిపోయినోడు మరిక లెగలేకపోండు సార్. నాకు భలే నవ్వొచ్చేసింది సార్. నవ్వుని బిగబెట్టుకొని ఆడిని లెగదీసి కూర్చోబెట్టినాను సార్.

ఆడి వాలకం చూడాలి సార్. మనిషి మనిషంతా గజగజ లాడిపోతుండు. ఒళ్ళంత సెవఁట్లు, సెవఁట్లు కక్కేస్తుండు. జుత్తు చేతుల్లోకి తీసుకొని బకిరేసుకుండు. ఆడినా వాలకంలో సూసి నా కడుపు నిండిపోనాది సార్. నా ఆనందం పైకేటి ఆగపణ్నీయకుండా ధెయిర్యం చెబుతున్నట్టు బుజం నొక్కేను సార్. ఇంత కాలం ఆడికి గెజం దూరంలో వుండి సలాం పెట్టేవోణ్ణి - ఆడి బుజం మ్మీద చెయ్యేసి - ధెయిర్యం చెప్పినానంటే ఏటి సార్? నాకన్న దిగువ స్థాయికి దిగిపోనాడన్నమాట. దిగిపోడా మరి. ఆ స్టేజిలో సార్ నా కాళ్ళకి నమస్కారం పెట్టరా నా కొడకా అంటే పెట్టేస్తాడన్నమాట. నిజం సార్.

నేను బుజం నొక్కి 'మరేటీ పర్వాలేదు. ధెయిర్యంగా వుండు. నేనన్నీ చూసుకుంటా' నన్నాన్సార్ అంతేసార్. నా చేతులు పట్టేసుకుండు. నాకు మటుకు ఆ టయంలో నిజంగా జాలేస్సింది సర్.

నాతో ఆడేటన్నాడు తెల్సాసార్ -

“ఒరే రంగా ఇలాగైపోద్దనుకోలేదురా... ఒరే ఒరే ఆ ముండ మొగుడ్తోను అళ్ళతోనూ, యిళ్ళతోను చెప్పేస్తాదంటావేట్రా” అన్నాడు ఎఁర్రిముకం ఏసుకోని ఏడ్చేశాడనుకోండి.

అందుకు నేనేటి చెప్పేది సార్.

కొందరాడోళ్ళు ఇలాంటి రంకు తగూలు ఎవల్తో చెప్పుకోలేరు. చెప్పుకుంటే తమ కళ్ళు తామే పొడ్సుకున్నట్టవుద్ది. అంచేత ఇంట్లోనే ఓ మూల కూలబడి ఏడ్చేడ్చి వల్లకునే రకం లాగలేదన్నాను. అలాగే అన్నాను సార్. అంతే. కుర్చీకి చేర్లబడి పోనాడు. మరీ జడిసిపోనాడు.

తవఁరిపుడు ఇక్కణ్ణుంచి వెంటనే ఇంటికెళ్ళిపోవడం మంచిదన్నాను.

అంతే సర్.

స్కూటరెక్కేసినాడు. పరిస్తితంతా ఇంటికొచ్చి చెప్పమని తుఁర్రుమన్నాడు. సిటంలో మాయమైపోనాడు.

ఆ తర్వాత ఏటయిందనుకున్నార్సార్?

ఆడు వెళ్ళిపోయిన అయిదు మినేట్లకి సర్ అప్పారావు గోడు పారొచ్చీసినాడు.

ఆ టయంలో అప్పిగోడు పదిమంది రత్నాకర్‌లని తినేయగలడన్నమాట. అలా వున్నాడ్సర్.

నన్ను గాని తన్నడు గదాని జడిసిపోణ్ణు సార్.

ఓరి బాబు. ఆడి వోలకం చూసి నా గుండెల్లో దడొచ్చొసినాడ్సర్.

ఆడి ముకం కందగెడ్డలాగున్నాది.

ఆడి కళ్ళు ఎఱ్ఱెర్రగా సింతనిప్పుల్లాగున్నాయి.

ఆడి సాతి ఎలాగంటే అలాగ పొంగి వున్నాది.

ఆడి పిడికిళ్ళు బిగిసున్నాయి.

మనోడు ఎక్కడైనా దాగుండిపోనాడేమోనని ఈ గదిలో, ఆ గదిలో మూలమూలన ఒకటికి పది సుట్లు ఎదికేసినాడ్సర్.

డాట్రు లేకపోవడంతో నా చొక్కా ఆడి పిడికిల్లో చిక్కిపోనాది సార్.

చొక్కా చింపేస్తే చించేసేయ్‌గాని నా వొళ్ళు మాతరం చీరేయకురోయ్ దేవుడా.. కాపాడ్రా తండ్రీ.. ఏడుకొండలవోడా, వొడ్డి కాసులవోడా... అని అనుకున్నాను. అంచేత మనల్ని ఏడుకొండలోడు కాపాడ్నాడు సార్.

ఒళ్ళు చీరేయలేదు. చొక్కా కూడా చించేయలేద్సర్.

నా చొక్కా పట్టుకుని 'ఏడా దొంగలంజాకొడక'ని అడిగినాడ్సర్.

దొంగ లంజకొడుకు దొంగచాటుగా పోనాడన్నాన్సార్.

'యెక్కడికి' అన్నాడ్సార్.

ఇంకెక్కడికి ఇంటికి – అందామనుకున్నాను. అవున్సార్. అలా అంటే చాలన్నమాట. ఆ వూపున ఆడింటికెళ్ళి ఒక్క గుద్దికి చంపేస్తాడు. అలాగున్నాడు అప్పిగోడు.

మనకెందుకూ పాపం అన్జెప్పి 'నాకు తెల్దు' అన్నాన్సార్. నమ్మక నన్నెక్కడ చంపేస్తాడో నని 'బగమంతుడు సాచ్చిగా' అని కలిపేను సార్.

ఆడు నమ్మేసినాడ్సర్.

మరాడి కసి, కోపం ఎలా సల్లారేటట్టు?

కుర్సీలు ఇరగ్గొట్టీసినాడ్సర్.

టేబులు తిరగదోస్సినాడ్సర్.

కేలండర్లన్నీ సించేసినాడ్సర్.

గదిలో సావాఁను సావాఁనంతా చిందర వందర చేస్సినాడ్సర్.

అక్కడితో వూర్కోలేద్సర్ ఆడు. వూర్కుంటే బాగుణ్ను. కానాడు ఎటన్నాడు తెల్సా సార్?

రత్నాకర్ అమ్మవీ, ఆలివీ గుడ్డలన్నీ ఊడబెరికేసి, నడిరోడ్డు మీద తొంగడెట్టేసి తను చెరిచేసి, తను చెరిచేసింది చాలక పదిమందిని ఆళ్ళ మీద కెక్కించి తన నోటి దూల

తీర్చుకున్నాడ్సర్.

సదుంకున్నోడు నోటంట అంతేసి బూతులు... ఓరి బాబో... నానెప్పుడూ ఇనలేద్సర్. ఆ తిట్లు మనోడుగాని ఇనుంటే అక్కడికక్కడే కత్తితో పొడిచీసుకు సచ్చిపోవాలన్నమాట. అలాంటి తిట్లు సర్ అవి.

అప్పిగోడి ఒళ్లు అలా సల్లబడి ఇక్కడ నుంచి వెళ్ళిపోయే వర్కూ నా గుండెలు గుండెల్లో లేవు సార్. నిజం సార్.

ఈ రోజు గది గదంతా సుబ్బరం చేయించి ఎక్కడదక్కడ పెట్టించేసరికి నా తల ప్రాణం తోక్కొచ్చీసినాద్సర్.

సరే. అప్పిగోడెళ్ళిపోనాడని చెప్పినాను గద్సార్. ఆడలా ఎలిపోయినెంటనే నేనొచ్చి గబగబా క్లినిక్కిని మూసేసి, తాళం ఏసేసి రత్నాకర్ ఇంటికి పరిగెత్తాన్సార్.

ఇంటికెళ్ళి సూద్దునుగదా.. ఇంకేటి.. మనోడు దేవదాసు పోజులోనున్నాడు సార్. పుల్లుగా బుడ్డి కొట్టేస్తున్నాడ్సర్.

ఏ మాటకామాట... ఎప్పుడూ లేంది నాక్కూడ సుక్క పోసినాడ్సర్.

తాగేకొద్ది తాగమని పోసినాడ్సర్.

అప్పిగోడు ఆంజనేయ అవతారమెత్తి క్లినిక్కినెలాగ లంకకన్న అద్దోన్నంగా దొంసం చేసేసినాడో చెప్పాన్సార్.

విన్నాడు. కాని -

ఆడి అమ్మనీ, ఆలినీ తిట్టిన తిట్లు చెప్పబోయాన్సార్. వినలేకపోనాడు.

ఆడి సెవులు మూస్కోలేక నా నోరు మూసేసినాడ్సర్ - సెయ్యడ్డం పెట్టి.

ఆయనక ఫోను ఎవల్కో ట్రయి చేసినాడ్సర్. కుదర్నేదులా వుంది.

నన్ను ఎంటనే అరిజెంటుగెళ్ళి గోపాలపురం పెసిడెంటునీ, మున్సిపల్లు కౌన్సిలేర్ని పారిటీ వుందని చెప్పి వున్న పళాన ఆటో మీద తీసుకురమ్మన్నాడ్సర్.

ఆ పెద్దల సంగతి నాకు తెల్సు సర్. బాగా తెల్సు.

ఆళ్ళు పెద్దలు కారు. పందులు. వూర పందులు. అవున్సర్! ఆళ్ళు ఒకటోరకం వూర పందులు.

ఆ పందుల్నించే గదండీ ఈ గోపాలపురం ఇలా నాశనమైపోవడం. కాదంటూరా. ఆళ్ళు మొదట్లో ఎలకల్లా వుండడం నేనేరుగుదున్సార్. ఆ ఎనక పందికొక్కుల్లా ఎదగడం కూడా నేనెరుగుదున్సార్. ఆ పందికొక్కులు పందులుగా బలిసిపోవడం కూడా నే చూస్తున్నా సర్.

కాని మన(కులం) కుర్రోళ్ళు అలా చూస్తూ వూర్కొనే రకం కాద్సర్. ఆ ఎదవ లిద్దరు నుంచి వున్న పదవులన్నీ వూడబెరికెయ్యాలని అదును కోసం చూస్తున్నార్సార్ - అయినా ఇయ్యన్నీ మీకు తెల్దేటి?... వూర్కోండి సార్ అన్నీ నాతోనే చెప్పించేస్తారు ఏటీ తెల్నట్టు.

నాకా పెద్దలంటే గొప్ప అసయ్యం సార్. అసయ్యంతో మరో మాట దొరక్క

పందులంటున్నానుగాని సార్... పందులు ఆ పెద్దల మీద చాల నయం కద్సర్.

ఏవంటే -

పందులు - వూర పందులు మన మలాన్నే తింటాయి.

కాని ఈ జోడి పందులు ఏకంగా మనల్నే తింటాయి.

ఏట్సార్. అవునా, కాదా?

అవును కదా... మనల్ని పీల్చుకు, పిండుకు తినేస్తున్నాయి. తినేసి బలిసిపోతున్నాయి.

అలా బలిసిపోయిన పందులు మనల్ని సంపడమే గాని అవి సావ్వు సార్.

దభేల్ దభేల్మని నాలుగు బడిత దెబ్బలేసినా సావ్వు సార్. మూతిని, కాళ్ళూ చేతుల్ని విరిచి కట్టేసి - వేలాడదీసి కింద ఇంత మంట పెడితే గాని సావ్వు సార్.

ఆ పందుల్ని సార్ నేను పారిటీకి పిల్వడాని కెళినాను.

పిలవాలేగాని ఆ పందులు పారిటీల కెందుకు రారు సార్, మాచక్కా పారొచ్చేస్తారు.

ఆళ్ళు పారిటీ అంటే చాలు! పందులకి దొడ్డి దొరికినంత ఆనందం. మురిక్కాలవలో దొర్లినంత ఆనందం. అవున్సార్.

ఎంత రాత్రవనీ, ఏ తుపాను రానీయ్, పిల్సునోడు ఎంత ఎదవన్నర ఎదవ అవ్వనీ ఎటెండయిపోతారు.

అంచేత నేను బుడ్డి మూ చూపించినానో లేదో - గడ్డెనకాల దున్నపోతులొచ్చేసినట్టు నా ఎనక పారొచ్చేసినారు.

ఆ పందుల్ని రత్నాకరు ఇంటికి తోలుకొచ్చి పడేసినాక -

ఆ పందులు తాగినంత తాగినాయి.

తిన్నంత తిన్నాయి.

జరిగిన గొడవంతా విన్నాయి.

విని, 'నీకేటి బయ్యెం లేదు గురూ, ఆ కేసు మాకొగ్గేయ్' అన్నాయి.

అంటే మనోడన్నాడు సార్ -

'అది కాదు, ఈ గొడవ గొడవంతా మన్లోనే వుండిపోవాల. నల్గురిలో పడకూడదు. ఎలాగైనా నా పరువు కాపాడాల' అని వేడుకున్నాడు.

'ఇయ్యేలున్న ఉద్దిరేకాలు, పగలు, కత్తి నూరడాలు రేపుండవు. అగ్గి సల్లబడుద్ది. అంచేత ఏటంటే రేపు సాయంకాలం అప్పిగోడింటికెళ్ళి రాజీ చేసేద్దాం, ఏటి? మరేటి బయ్యెం లేదు. ఎల్లుటి ఉంచి నీ క్లినిక్కు నీవు మామూలుగా తెర్చుకోవచ్చు' అని హామీ ఇచ్చేసినాయి సార్ పందులు.

అలా అని మందు గిలాసుల్తో ప్రమాణం చేసినాయి సార్ పందులు.

అప్పుడ్సార్, మనోడికొద్దిగా వూపిరాడినాది.

అప్పుడ్సార్, మనోడికొద్దిగా ధయిర్యం చిక్కినాది.

ఇదేసార్, ఇద్దిదేసార్.. నాకు తెల్సినంత మటుకు జరిగిన కత-"

అని ముగించేడు రంగా.

ముగించి సిగరెట్ చంద్రంని అడిగేడు.

చంద్రం సిగరెట్ ఇస్తూ "ఇంత వండర్‌ఫుల్ స్టోరీని... ఇంత వర్కూ నా చెవిని వేయకపోవం చాలా ఘోరం రంగా... ఇదైనా నేనొచ్చి ఏటి కథ అని అడిగితే గాని చెప్పావు కాదు" అన్నాడు.

"ఏదీ. ఎక్కడ సార్. నిన్ననే గదా జరిగినాది. ఇగో మీ కొచ్చి చెబుదారనుకున్ను. ఇంతలో మీరే కొట్టుకొచ్చీసేరు."

"సర్లేగాని రంగా... ఇపుడు అప్పారావు ఇంట్లో రాజీ కార్యక్రమం అన్నమాట."

"అంతేగద్సార్"

"నీ అభిప్రాయం ఏవిటంటావు? వాళ్ళు రాజీకొచ్చేస్తారంటావా?"

"అది చెప్పలేం సార్"

"చెప్పడానికే ముందయ్యా అందులో, నాకు మటుకు రాజీ అంత తేలిక కాదని అనిపిస్తోంది. నీవు చెప్పిన దానిని బట్టి చూస్తే ఆ అప్పారావు ఎవడో గాని వాడు ఏ పందుల్కి లొంగేరకంలా లేడు. వాడు రాజీకి చచ్చినా ఒప్పుకోడు. పైగా రత్నాకర్‌ని చిదగతన్నినా తంతాడు."

"తన్నాల్సిందే సార్. తంతే మళ్ళీ అలాగిలా కాదు. గోపాలపురం మొకం మళ్ళీ సూడకుండా అయిపోవాలన్నమాట."

"ఖచ్చితంగా అలాగే అవుద్ది రంగా చూడు అలాగ."

"ఏటి? నిజవేఁనేటి సార్."

"నిజవుఁ. అవునో కాదో నీవే చూస్తావుగా. కథను ఇంత వర్కూ నీవు చెప్పేవు. తర్వాత కథ ఇక నేను నడిపిస్తాను."

## - 5 -

రంగా చెప్పిన కథకి నాలుగు కల్పించి మరి చెప్పి - "అదిరా సంగతి, ఏం చేద్దామంటావ్" అన్నాడు చంద్రం, రవితో.

"నథింగ్. ఇందులో మనం చేసేదేముంది! వుయ్ ఆర్ నాటెటాల్ కనెక్టడ్ టూ దట్ స్టోరీ కదా. మనకేం సంబంధం?" అన్నాడు రవి, చాలా సింపుల్‌గా!

"చంపేశావు పో! ఇంతవరకూ ఆ కథతో మనకి సంబంధం లేదన్నది రైటే. కానిప్పుడు మనం కలుగజేసుకోడం అవసరం. అత్యంత అవసరం. దిస్ ఈజ్ ఏ గ్రేట్ ఏపర్ట్యూనిటీ. సో, వుయ్ మస్ట్ యుటిలైజిట్. వచ్చిన అవకాశాన్ని చేజేతులా జారవిడిచేస్తామా?"

"జారవిడిచేయక ఏం చేస్తావు?"

"ఏం చేస్తానా? ఈ దెబ్బతో రత్నాకర్ దుకాణం ఎత్తించేస్తాను. వాడు లక్ష్మిపై జరిపిన

అఘాయిత్యం వూరు వూరంతా టాంటాం చేయించేస్తాను. వాడి పరువు బజారున పెట్టేస్తాను. మొన్న మొన్న ఏక్సిడెంటు కుర్రాడి కేసు. ఇపుడు ఈ కేసు – ఈ రెండూ చాలు వాడి బిజినెస్ డౌన్ చేసేయడానికి. ఇక్కణ్ణించి క్లినిక్ ఎత్తించేయడానికి."

"నీవు చెప్తున్నంత తేలికా అది!"

"తేలికా, కష్టమా అనేది ఎలా చెప్పగలం? దిగితే కాని లోతు తెలీదు కదా. బట్ వన్ థింగ్. విజయం మాత్రం మనదే. అది గన్‌షాట్. ఎలా అంటావ్? అప్పుడే అంతా ఆలోచించేన్రా బాబూ. విను – రత్నాకర్ సైడు పెద్దలున్నారు గదా. వున్నియ్, వాళ్ళని అక్కడే వున్నియ్. వాళ్ళు ఆ సైడు వుండడమే మనకి కావాలి. అప్పుడే కుర్రసైన్యం మన సైడు వస్తారు. నీకు తెల్సునో లేదో ఆ పెద్దలంటే మొత్తం కుర్రకారంతా పరమ వ్యతిరేకంగా వున్నారు. అంచేత ఆ యంగ్ ఫోర్సుని మనం వాడుకుంటాం. ముందుగా ఈ గొడవ యువజన క్లబ్‌లో కదుల్తుంది. కదిలి కుల సంఘాన్ని కదుపుతుంది. కుదుపుతుంది."

"కుల సంఘం ఎందుకూ మధ్యలో!" విస్తుపోతూ అడిగేడు రవి.

"ఎందుకా! భలేవాడివిరా బాబు. అదే ముఖ్యం. వెర్రి మొహం వేయక పూర్తిగా విను. ఈ గోపాలపుర ప్రజలదంతా – ఆల్‌మోస్టు ఆల్ – అందరిదీ మన కులం. లక్ష్మిది కూడా మన కులం! కాని రత్నాకర్‌ది కాదు మన కులం! దట్సాల్. కులతత్వం జనాల గుండెల్లోకి ఇంజెక్టు చేస్తాం. రెచ్చగొడతాం. యువజన సంఘంలో రాజుకున్న నిప్పు కుల సంఘంలో రైజవుతుంది. వెంటనే అత్యవసర కమిటీ మీటింగులు, ఆ వెంటనే సర్వసభ్య సమావేశం. ఆ సమావేశంలో ఉద్రేకపరిచే ఉపన్యాసాలు, నినాదాలు, చివర్లో తీర్మానాలు...

ఎలాంటి తీర్మానాలు?

రత్నాకర్ డాక్టరు కాదు, కాదు. వాడు మానభంగాల స్పెషలిస్టు.

ఆ స్పెషలిస్టు ప్రాక్టీసు నిక్కడ కొనసాగిస్తే ఈ వూళ్ళో ఆడవాళ్ళకి సెక్యూరిటీ ఏముంది?

వాడి వాత పడింది ఈ రోజు లక్ష్మి అయింది. రేపు సీత అవుతుంది. ఎల్లుట మరో అప్పలమ్మ. అనసూయ అవుతారు.

అంచేత ఏమిటంటే వాడి క్లినిక్ పూర్తిగా – గోపాలపురం నుంచి ఎత్తించేయాలి.

తప్పదు. తప్పదు.

అంతేకాదు–

లక్ష్మిపై వాడు అత్యాచారం జరిపిన నేరానికి కఠినమైన శిక్ష పడేలా ఆందోళన చేయాలి – అంటాయి తీర్మానాలు.

అంచేత తీర్మానాలు అమలు జరిగేదాక ఆందోళనలు జరుగుతాయి.

ఊరేగింపులు జరుగుతాయి.

సభలు జరుగుతాయి.

వాడి క్లినిక్ ముందే రిలే నిరాహారదీక్ష శిబిరాలు లేస్తాయి.

అవసరమైతే ఆమరణ నిరాహారదీక్షలు కూడా జరుగుతాయి.

అంతేగాని ఆగదు బండి. 'కులం' ఇంధనంతో చకచకా సాగిపోతుంది బండి.

ఒరే రవీ... ఇందులో నీ రోల్ కూడా వుంది.

చాలా ఇంపార్టెంట్ రోల్. కీ రోల్.

నీవు పబ్లిసిటీ ఇన్‌ఛార్జివన్నమాట.

మన ఉద్యమం యొక్క డైలీ ప్రోగ్రెస్ ఏరోజు కారోజు తాజాగా, గరమ్ గరమ్‌గా పేపర్లోకి దిగిపోవాలి. ఆ బాధ్యత నీది. దినపత్రిక ఎడిటరు నీకు బాగా ఫ్రెండు అని నాకు బాగా తెలుసు. అందుకే ఆలోచించి నీకు ఆ శాఖ ఇచ్చాను.

ఇపుడు మనం వెంటనే చేయాల్సిన పని వుంది. అదేమిటంటే ఈ రేప్ కేసు రేపు ఉదయానికి అచ్చురూపంలో అందరి కళ్ళల్లోకి దిగబడిపోవాలి. తెల్సిందా.

అంచేత పదపద పత్రికా కార్యాలయానికి క్విక్. క్విక్.

పదరాబాబు. పదపద." అన్నాడు చంద్రం.

కదల్లేదు రవి.

తనకి చంద్రం కొత్తగా, వింతగా... ఉన్మాదిలా కనిపించాడు. ఏదో సంధి వచ్చి వాగుతున్నట్టు, మందు కొట్టేసి పేలుతున్నట్టు తోచాడు.

చంద్రం చెప్పేదంతా ఓపిగ్గా విన్నాడు. ఆశ్చర్యపోతూ విన్నాడు. విస్తుపోతూ విన్నాడు.

విని చివరికి "సారీ" అనేశాడు.

"సారీ చంద్రం. వెరీ వెరీ సారీ. నేను రాలేను. అది నా వల్లయే పని కాదు ఆ పత్రిక ఎడిటర్ నా స్నేహితుడైతే అవొచ్చు గాక - కాని స్నేహాన్ని ఇలాంటి నీచకార్యాలకి వినియోగించలేను."

"అదేవిట్రా అలా అనేస్తావ్! లేన్దేదో వేయించమంటున్నానా! వున్నదే, జరిగిందే వేయించమంటున్నాను."

"జరిగిందే అయితే, వేయాల్సిందే అయితే ఆ పత్రిక వాళ్ళే వేసుకుంటారు. నే చెప్పాల్సిన పని లేదు. నేను చెప్పను కూడా!"

"ఆదిలోనే హంసపాదేవిట్రా బాబూ. అలాగనేయకు. నీ సాయం నాక్కావాలి. ప్లీజ్"

"చంద్రం నన్నీరొచ్చులోకి లాగకు. రొంపిలోకి దింపకు. దింపాలని నన్ను నీవు ఎంత ప్రయత్నించినా నేను దిగను కాక దిగనని ఇదే నీకు స్పష్టం చేయడం....

అంతేకాదు స్నేహితునిగా నా సలహా ఏమిటంటే నీవు ఈ నీచపు ఎత్తుగడల రాజకీయాలు కట్టిపెట్టు. ఆ రాజకీయాలు మన కొద్దు. నే చెప్పేది కూడా కాస్త విను. కొందరు స్వార్థ, పదవీ రాజకీయాల చదరంగంలో అమాయక ప్రజను, దుర్బల వర్గాలను పావులుగా వుపయోగించుకోవడం జరుగుతోంది. అంచేతనే ఈ దేశంలో కుల, మత, ప్రాంతీయ సంబంధమైన విభేదాలు, వైషమ్యాలు ఎక్కువగా సాగుతున్నాయి.

అవును కదా! నీవు చేస్తున్నది అదే. ఆ నీచ, స్వార్థ సంకుచిత రాజకీయాల వైపే వెళ్తున్నావు.

నిజానికి నీకు లక్ష్మి ఎవరో తెలీదు. అప్పారావు ఎవరో తెలీదు. రత్నాకర్‌తో నీకు ప్రత్యక్షంగా ఎటువంటి విరోధమూ లేదు. పోనీ కనీస పరిచయం కూడా లేదు. ఇంతా చేసి రంగా చెప్పిన ఆ మానభంగం కేసు ఎంతవర్కూ నిజమో తెలీదు.

కాని నీవు ఆ నిజానిజాలతో సంబంధం లేకుండా, దొరికిందిగదా ఛాన్సు అన్చెప్పి, పెద్ద ఆందోళన లేవదీసి... రత్నాకర్ ప్రాక్టీసుని ఇలాగైనా దెబ్బతీయిస్తే నీ ప్రాక్టీసు బాగుపడుతుందేమోనన్న ఆశతో - కేవలం ఆశతో - నీవీ కుటిల, కుత్సిత రాజకీయాలని ఆశ్రయిస్తున్నావు. కులతత్వ ఆయుధాన్ని వాడుకుంటున్నావు.

నీ స్వార్థం కోసం అమాయక ప్రజల్ని ప్రొవోక్ చేయడం తప్పు కాదూ!

చూడూ, మనది బలంగా పాతుకుపోయిన కులవ్యవస్థ. అంచేత అంత వేగంగా మనల్ని వదలదు. కులం అనేది ఒక కట్టుబాటు కోసం వుందంటారు. దాన్ని(జాతి ప్రయోజనాలు దెబ్బతినకుండా) ఒక మంచి పనికి వాడుకోవడంలో తప్పు లేదు. కాని నీవు స్వార్థానికి వాడుకోవాలని చూస్తున్నావు. అది ఏం మంచి పని చెప్పు?'

నాదీ, నీది ఒకే కులం. అయినప్పటికి నిన్నెప్పుడూ ఆ దృష్టితో చూళ్ళేదు. స్నేహితునిగానే చూశాను. కాని నీవు నన్ను ఏ దృష్టితో చూస్తున్నదీ ఇప్పుడు నాకు అర్థమవుతోంది!

స్నేహితునిగా నా రిక్వెస్టు ఒక్కటే. ప్లీజ్ విత్ డ్రా యువర్ ప్లాన్. నీ పథకం విరమించుకో. నీవు డాక్టర్వనే సంగతి మర్చిపోకు. నీకీ స్వార్థ సంకుచిత రాజకీయాలు తగదు. నా మాట విను" - అంటూ రవి చంద్రంని చాలా విధాలుగా నచ్చచెప్పి చూశాడు.

కాని చంద్రం వినిపించుకోలేదు.

పైగా -

"ఒరే బాబూ నీవు సాయం చేయకపోతే మానే... నాకు మాత్రం అడ్డు రాకు. నీవు వేయి చెప్పు. లక్ష చెప్పు. నేనీ అవకాశం వదుల్కోలేను. వదుల్కోలేను. అంతే" అని స్పష్టంగా చెప్పేసాడు చంద్రం.

రవి నిట్టూర్చి... "సరే నీ ఇష్టం.. కాని నా బాధల్లా ఏమిటంటే ప్రజల మనిషిగా వుండాల్సిన ఒక డాక్టరు సంకుచిత స్వార్థాలకి లోనైపోతున్నాడని!... లోనైపోయి ఆత్మ వంచకుడి గాను, పరవంచకుడిగాను మారిపోతూన్నడని.. ఒకే వస్తాను.. నీవు మన స్నేహం కాన్నా.. నీ స్వార్థానికే విలువ ఇస్తున్నావు! సో, నీకు, నీ స్నేహానికి ఇక గుడ్‌బై!... వస్తాను" అంటూ వెళిపోతున్న రవి చేయి పట్టుకొని ఆపబోయేడు చంద్రం.

కాని చేయి విదిలించుకొని విసవిసా వెళిపోయేడు రవి.

చంద్రం ఆ క్షణంలో సిగ్గుపడ్డట్టు తల దించేసుకున్నాడు.

తర్వాత దీర్ఘంగా నిట్టూర్చేడు. నిట్టూర్చి తను ఈ క్షణం నుంచి నడపబోయే నాటకానికి నాందిగా... గబగబా యువజన సంఘం వైపు కదిలేడు చంద్రం.

- 6 -

అప్పారావు ఇంట్లో -

పెద్దలిద్దరూ సోఫా మీద ఆశీనులై వున్నారు.

కుర్చీ వున్నా రత్నాకర్ నించొనే వున్నాడు.

అప్పారావు పెద్దల ఎడల వినయంగా, రత్నాకర్ అంటే అతి కోపంగా వున్నాడు.

ఇంకా ఆ గదిలో వుండాల్సిన వ్యక్తి - అసలు వ్యక్తి లక్ష్మి!

ఆమె అక్కడ లేదు.

వంట గదిలోనే వుండిపోయింది.

ఆమె నిన్నటి నుంచి తినకుండానే వుండిపోయింది.

నిద్ర పోకుండానే వుండిపోయింది.

జుట్టుని దువ్వకుండా, బట్టలు మార్చకుండా, ఏడుపు ఆపకుండా అలానే వుండిపోయింది.

పిలవకుండానే వచ్చిన పెద్దలు జరిగిన విషయం చెప్పమన్నారు - అంతవర్కూ తమకేమీ తెలీనట్టు!

రత్నాకర్ చెప్పేడు.

"నాది చాలా దురదృష్టం. ఇలా జరుగుతుందనుకోలేదు. ఆమె కళ్ళు ఎగ్జామిన్ చేస్తుండగా.. ఎలా స్లిప్ అయ్యేనో తెలీదు... కాస్త.. నా ముఖం ఆమె ముఖానికి తగిలిందనుకుంటాను. అంతే.. అంతే జరిగింది. కాని లక్ష్మిగారు మరోవిధంగా భావించేరు. నేనేదో ముద్దు పెట్టుకోబోతున్నట్టు భ్రమపడినట్టున్నారు. ఏమైనా ఇలా జరిగినందుకు చాలా విచారిస్తున్నాను. లక్ష్మిగారు నన్ను అపార్థం చేసుకున్నారు. నే తెల్సుండి తప్పేమీ చేయలేదు. ఆ భగవంతుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను. పదేళ్ళుగా ఈ వూళ్ళో ప్రాక్టీసు చేస్తున్నాను. ఎప్పుడైనా నా గురించి చెడుగా విన్నారా చెప్పండి అప్పారావుగారూ."

"మీ గురించి చెడుగా విన్లేదు. నిజవేఁ! కాని నా భార్య చెప్పింది తప్పంటారా. మీ మీద కావాలని చెడుగా చెబుతోందంటారా. అబద్ధాలు ఆడుతోందంటారా!"

"నేనలా అనటం లేదు. లక్ష్మిగారు నే చేస్తున్న టెస్టింగ్‌ని అపార్థం చేసుకున్నారంటు న్నాను. కాలు స్లిప్ అయి ఆమెపై కొద్దిగా పడ్డం నిజవేఁ. అప్పుడందుకు సారీ చెప్పుకునే అవకాశం కూడా నా కివ్వలేదు లక్ష్మిగారు. గభాల్న, పరుగు పరుగున వచ్చేశారు. ఇపుడు మీకు ఆ విషయమై సారీ చెప్పుకుంటున్నాను. క్షమించండి... చూడండి అప్పారావుగారూ నిజంగా తప్పు చేసిన వాడికి... తిన్నగా మీ ఇంటికే వచ్చి మీ ముందు నిలబడగల ధైర్యం వుంటుందా.... నన్ను నమ్మండి... నాకు ఏడుకొండల వాడంటే ఎంత భక్తో మీకు తెలుసు. నేను ఆ ఏడుకొండలవాడి సాక్షిగా చెబుతున్నాను. నేనే పాపం చేయలేదు నన్ను నమ్మండి."

అప్పారావు ఏదో అనబోతుంటే పెద్దలు వారించేరు.

"అప్పారావు! తీర్పు చెప్పాల్సింది మేము. ఎందుకు చెప్పు కేకలు. డాక్టరు రత్నాకర్

చెప్పింది కరెక్టు అవునా కాదా అనేది తేల్చాల్సింది మేము. అవును కదా. రత్నాకర్‌గారు చెప్పడం అయింది. ఇక లక్ష్మి చెప్పింది కూడా వినాలి కదా. ఆమె చెప్పింది కూడా విన్నాక – తీర్పు! అర్థమయిందా. అంచేత లక్ష్మిని తీసుకురా వెళ్ళు."

అప్పారావు బుర్ర తాటించి, లక్ష్మిని పిలవడానికి వంటగదికేసి వెళ్ళేడు.

తనామెను పిలవబోయేది దీనితో మూడవసారి!

మూడుసార్లు కాదు, మూడు వందలసార్లు పిలిచినా ఆమె వంటగది వదిలి వచ్చేలా లేదు.

"నేనెందుకు రావాలంట? అసలు నీకేవైనా బుర్రున్నాదా! ఆడు – ఆ దొంగ సచ్చినోడు నన్ను బలవంతం చేయబోయాడని నీకు నిన్న చెప్పానా లేదా. చెప్పానా? చెప్పగానే నీ వాణ్ణి చంపేయడానికి వెంటనే బయల్దేరావా? లేదా? వెళ్ళావు కదా.

ఇపుడా ఎదవ నీ ఎదురుగానే వున్నాడు. ఆణ్ణి చితకబొడిచేసి చింతపండులా కుమ్మేసే బదులు... ఇప్పుడు చిత్రంగా, కొత్తగా మాటాడ్తున్నావేటి?

నీవూ మొగుడువేనా?

ఆహా! నీవు మొగుడివేనాయని?

నీకు సీవూఁ నెత్తురూ వుందా?

నీకు సీవూఁ నెత్తురూ వుంటే నీ పెళ్ళాం ముండ మీద ఆబోతులా పడిపోయిన ఆ ఎదవ సచ్చినోడినలా వదిలేయవు.

నీకు సీవూఁ నెత్తరూ వుంటే మళ్ళ పెద్దలూ, గెద్దలూ వచ్చారని తచ్చాడవు.

అసలు పెద్దలెందుకొచ్చారు?

నీవేమైనా బొట్టెట్టి పిల్చావా?

తగూ చెప్పి తీర్పు కావాలని కాళ్ళు పట్టుకున్నావా?

మరి నీవు పిలవలేందే ఎందుకొచ్చినట్టు!

ఎందుకొచ్చారో నేను చెప్పనా! ఆ డాట్రు బాడుకావ్‌ని రచ్చించడానికి, నీవు ఆణ్ణి చితకబొడిచేయకుండా చంపేయకుండా చెక్రం అడ్డెయ్యడానికి.

అందుకే ఆళ్ళ ముగ్గురూ కూడబలుక్కుని వచ్చారు. కుమ్మక్కయి వచ్చారు.

సరే, వచ్చారు.

నేను చెప్పింది నీవు నమ్మినావు గదా. ఇక ఎవలుకో నేనొచ్చి చెప్పేదేటి?

ఆళ్ళు నమ్మేదేటి?

సరే నేనొచ్చి చెబితే ఆళ్ళు నమ్మలేదనుకో.

అప్పుడేటి?

నాది అబద్ధవన్నమాట... అంతేనా?

ఆడు నన్నేటి బలత్కారం చేయలేదన్నమాట. అంతేనా!

ఏటి?... పెద్దమనుషులా!... అరిస్తే బాగోదా!

నేను అరుస్తున్నానా?

అవును అరుస్తున్నాను. నా యింట్లో నేను అరుసుకుంటే ఆళ్ళకేం!

నేను అరుస్తుంది వున్న విషయవేఁనా, మరేటైనా!

వున్న విషయమేఁ కదా.

పెద్దలనేటప్పటికి నీ పవురుసం, నీ కోపం, నీ మగతనం, నీ కసి... అన్నీ సల్లారి పోయాయన్నమాట!

బాగుంది మొగుడా బాగుంది.

నన్నా గదిలోకి రమ్మంటున్నావు. నన్ను చూసి ఆ ముండసచ్చినోడిలాగే నీ పెద్దలు కూడా నా మీద పడిపోతే ... అప్పుడు కూడా అమ్మో, పెద్దలు, పెద్దలు ఫర్లేదు, ఫర్లేదు అంటావుగావాల..." అక్ష్మి అంటూనే వుంది.

ఇక తట్టుకోలేక, అప్పారావు ఇవతలకి వచ్చేశాడు.

ఆమె రాకపోయినా, ఆమె మాటలు గోడలు దాటి, వాళ్ళ ముగ్గురి గుండెల్లో గునపాల్లా గుచ్చుకున్నాయి.

పెద్దల నోటంట మరిక మాట రాకపోవడంతో, మరిక లాభం లేదని రత్నాకరే ముందుకు వచ్చాడు.

"లక్ష్మిగారు చాలా కోపంలో వున్నారు. సహజం కూడా. సరే కానివ్వండి. జరిగిందాన్ని తప్పుకోడం దేనికి! నేను తప్పు చేశాననే ఒప్పుకుంటున్నాను. అందుకు క్షమాపణ చెప్పుకుంటున్నాను. లేదూ, చేసిన తప్పుకి ఏ శిక్ష అయినా విధించండి. నేను సిద్ధం. మీరు నిన్న నన్ను చంపేయడానికొచ్చేరట. నేను లేకపోవడంతో క్లినిక్‌ని ధ్వంసం చేసేసారు. ఉద్రేకంలో అది సహజంలెండి. నేనేం అందుకు బాధపడ్డం లేదు. మీరు నన్ను చంపడానికొచ్చారు. లక్ష్మిగారి కోరిక కూడా అదే కదా! ఇప్పుడు ఆ పనే కానియ్యండి, అప్పారావుగారూ, అందుకు నేను సిద్ధం" అని అంటుంటే రత్నాకర్ గొంతు బొంగురు పోయింది. అప్పారావు చేతులు పట్టుకుని తల కిందకి దించేశాడు.

రత్నాకర్ కళ్ళల్లోంచి రెండు నీటి చుక్కలు అప్పారావు అరిచేతులపై పడ్డాయి.

అప్పారావు చేతులు వణికిపోయేయి.

ఆ రెండు చుక్కల కన్నీళ్ళు అప్పారావు చర్మంలోకి ఇంకిపోయి రక్తాన్ని నీరుగా మార్చేసినట్టు ద్రవించి పోయేడు. కరిగిపోయేడు. పూర్తిగా చలించిపోయేడు.

అంతే!

రత్నాకర్‌ని క్షమించేయదల్చుకున్నాడు!

అప్పారావులో క్షమాగుణం చాలా ఎక్కువ!

అప్పారావుకి ఇందిరాగాంధీ అంటే ఎంతో అయిష్టం. కోపం, రాజకీయాల్లోకి ఎప్పుడూ దూరని తను ఎలక్షన్లో ఆమె పార్టీకి వ్యతిరేకంగా ఫీల్డులోకి దిగేడు. ఇందిరాగాంధీ పవరులోకి

రాగూడదనే లక్ష్యంతో రేయింబవళ్ళు శ్రమించి పనిచేశాడు. అయితే పదకుండు-ఏళ్ళు ఏలిన ఇందిరాగాంధీ కొడుకుతో సహా ఎలక్షన్లో ఓడిపోగానే 'అయ్యో పాపం' అని విపరీతంగా జాలిపడి పోయేడు. ఆ రోజు రోజంతా అదోలా వుండిపోయేడు!

నిన్న రత్నాకర్‌ని చంపేద్దామని కసిగా అనుకున్న అప్పారావు... ఈ రోజు రత్నాకరే తన చేతులు పట్టుకునేటప్పటికి, రెండే రెండు కన్నీటిబొట్లు రాల్చేసేటప్పటికి... క్షమించేస్తున్నాడు! తన పెళ్ళంపై అత్యాచారం జరిపినవాణ్ణి ఈజీగా క్షమించేస్తున్నాడు!

మనిషి తాలూక ఎమోషన్సు ఎంత చిత్రమైనవి!

ఎలాగైతేనేం, వచ్చిన పని సఫలీకృతమైనందుకు పెద్దలిద్దరూ సంతోషించేరు.

తన గుండెలపై నుంచి కొండని దింపుకున్నంత తేలిగ్గా నిట్టూర్చేడు రత్నాకర్.

కాని అంతలో –

అకస్మాత్తుగా సీను మారింది!

లక్ష్మి ఆదిశక్తిలా, అమ్మవారిలా... ప్రళయ భీకరంగా... భయంకరంగా.. కళ్ళల్లోంచి కణకణలాడే అగ్నివర్షం కురిపిస్తూ.. ఆ గదిలోకి ప్రత్యక్షం!

ఆమె చేతిలో ఒకే ఆయుధం!

అది కర్రపేడు!

ఆ కర్రపేడు వూపున రత్నాకర్ వీపు మీద పడింది! ఆ వెంటనే అతని నెత్తిపై దబ్‌మని పడబోయింది!

అంతలో అప్పారావు గభాల్న ఆ కర్రపేడుని లాక్కున్నాడు. లేకుంటే రత్నాకర్ తల రెండుగా చీలి, మెదడు బయటకొచ్చేసేదన్నది నిజం!

అప్పారావు ఆమె చేతిలో కర్రపేడు లాక్కోగలిగాడు గాని ఆమెను ఏమాత్రం ఆపలేకపోయాడు. రత్నాకర్ మీదకి అమ్మవారిలా, కొదమ సింగంలా విరుచుకుపడిన ఆమెను పట్టుకోలేకపోయేడు.

ఆమె చేతిలో కర్రపేడు లేకుంటేనేం?

వాడి వాడి గోళ్ళున్నాయి! గోళ్ళతో రక్తం వచ్చేలా రక్కేసింది.

ఆమెకు పదునైన గట్టి పళ్ళున్నాయి. పళ్ళు నాటుకుపోయేలా కరిచేసింది!

ఆమెకి బలమైన కాళ్ళున్నాయి! కాళ్ళతో తీసిపెట్టి తన్నేసింది!

చేతులున్నాయి! అవి మెత్తని, సుకుమారమైనవి కావొచ్చు. కాని మూతి మీద చాచి పెట్టి కొడితే... ముందు పన్నొకటి రాలి పడిపోయింది!

అయితే –

కాసేపుంటే ఆ కొదమ సింగం రత్నాకర్ ప్రాణాలు తీసేసేదో, గుండెకాయలు తినేసేదో... ఇంకేం చేసేదో గాని... అప్పారావు ఎక్కడలేని శక్తిని తెచ్చుకొని ఆ కొదమ సింగాన్ని జుట్టు పట్టుకీడ్చి వంటగదిలో బంధించేశాడు.

అయినా ఆమె తలుపులు దబదబా బాదుతోంది – తలుపు రెక్కలు వూడిపోతాయో,

విరిగిపోతాయో అన్నంత గట్టిగా!

ఆమె తలుపుల మీద కాకుండా తమ గుండెల మీదే బాదుతున్నట్టుగా బెదిరిపోతున్నారు పెద్దలు!

ఆ పెద్దలు ఆ దెబ్బతో గదిలోంచి బయటకొచ్చేసి వరండాని ఆశ్రయించారు. తమని కూడా తన్నడానికొస్తే మెట్లు దిగి పారిపోడానికి రడీగా వున్నారు!

కిందపడిపోయిన రత్నాకర్‌ని అప్పారావు లేవదీస్తే గాని లేకలేకపోయాడు. ఒళ్ళంతా రక్కులు! గాట్లు! మూతి నిండా, బట్టల నిండా రక్తం!

రత్నాకర్ రుమాలుని మూతి కడ్డంగా పెట్టుకున్నాడు. ఆ రుమాలు అప్పారావు ఇచ్చాడు!

ఒక ఆడది... మగాడైన మొగుడు ముందు, పెద్దల ముందు పేరుమోసిన డాక్టరైన ఒక మగాణ్ణి... ఒక్క ఉదుటున వచ్చి అలా చితకబాదేయడం - అప్పారావు ఏ మాత్రం ఆమోదించలేకపోయేడు. హర్షించలేకపోయేడు.

'నా పెళ్ళం ఆడది కాదురా బాబూ, రాక్షసి' అనుకున్నాడు.

ఆమె చేసిన పనికి బాధపడ్డాడు.

అంచేత రత్నాకర్‌కి తన పెళ్ళం తరఫున క్షమాపణలు చెప్పుకున్నాడు!

"పోనీలెండి. లక్ష్మిగారి కోపం తీరింది. అంతేచాలు" అన్నాడు నెమ్మదిగా రత్నాకర్.

'లక్ష్మి ఆగ్రహం వల్ల ఒక్క పన్నే కాదు, పదహారు పళ్ళు వూడిపోయినా ఫర్వాలేదు. కనకవర్షం కురిపిస్తున్న నా క్లినిక్ పచ్చగా వుంటే చాలు - ఏ గొడవా లేకుండా! ఇక ఈ అవమానమా.. ఈ నాలుగ్గోడలు దాటకుండా వుంటే చాలు, చాలు' అనుకొని ' ఈ అవమానం గోడలు దాటిపోదనే' హామీ అప్పారావు చేత పొంది, 'ఫర్లేదు, రేపణ్ణించి నా ప్రాక్టీసు నిరాటంకంగా సాగుతుంది' అని ధైర్యం వచ్చి గుండె దిటవు పొందింది రత్నాకర్‌కి!

## - 7 -

రేపణ్ణించి రత్నాకర్ ప్రాక్టీసు నిరాటంకంగా సాగుతుందా?

రత్నాకర్ ప్రాక్టీసు పడగొట్టాలనే చంద్రం పథకం పారుతుందా?

రత్నాకర్ ప్రాక్టీసు రేపు సాగవచ్చు. ఎల్లుట సాగకపోవచ్చు. చంద్రం పథకం పారొచ్చు. పారకపోవచ్చు.

అది కాదు ప్రశ్న!

ఎందుకీ పన్నాగాలు? ఎందుకీ కుతంత్రాలు? ఎందుకీ కుట్రలు? ఎందుకీ దొంగ నైచ్యాలు? - అదీ ప్రశ్న!

పోటీ!

పోటీ. పోటీ. పోటీ.

అవును. ఈ పోటీ వ్యవస్థ కొనసాగినంత కాలం ఈ కుట్రలూ కుతంత్రాలూ, ఈ పన్నాగాలు, ఈ దొంగ నైచ్యాలు... ఇవన్నీ తప్పవు అనుకొని నిట్టూర్చేడు రవి.

చంద్రాన్ని, చంద్రం స్నేహాన్ని వదలుకున్న రవి. ✿